
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

1

శుక్రవారం 26 ఏప్రిల్ 2024





- అండగా నిలుస్తా..
- అన్నీనేనే చూసుకుంటా
- ప్రజల బాధలు కదిలించాయి..
- అవి చూసి చలించిపోయా
- ప్రజలు అక్కున చేర్చుకుంటున్న తీరు ఎన్నటికీ మరువలేను
- ఆంధ్రజ్యోతితో గుంటూరు పశ్చిమ కూటమి అభ్యర్థి గల్లా మాధవి



చిత్తశుద్ధితో.. పని చేస్తా

మీ బిడ్డననుకుని గెలిపించండి

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మీ ఇంటి బిడ్డననుకుని గెలిపించండి.. అన్నీ నేనే చూసుకుంటా. నేనేదో అద్భుతాలు చేసేస్తానని చెప్పలేను కానీ.. మన కళ్ల ముందు కనిపిస్తున్న సమస్యలు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తా. సొంత బిడ్డలా నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తా.. అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థి గల్లా మాధవి తెలిపారు. ఎలాంటి రాజకీయ అనుభవం లేకపోయినా ప్రజలకు ఏదో చేయాలన్న తపనతో రాజకీయరంగ ప్రవేశం చేసిన ఆమె ఎవరూ ఊహించని విధంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం తరపున ఎన్నికల రణక్షేత్రంలోకి దూకారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రచార అనుభవాలు, ప్రజల నుంచి వస్తున్న స్పందన, తనపై, పార్టీపై ప్రజల విశ్వాసం, ఎదురైన అనుభూతులను ఆమె ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

ప్రజల స్పందన

గల్లా మాధవి: ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం కొత్త. ఎలా ఉంటుందో అనుకున్నా. కానీ ప్రజల్లోకి వెళ్లిన తర్వాత వారు ఎన్నో సమస్యల్లో ఉన్నారని తెలిసింది. మా ఆస్పత్రికి వచ్చేవాళ్లను చూసినప్పుడు కొన్ని గమనించా. కానీ.. ప్రచారంలో మరెన్నో విషయాలు తెలుసుకున్నా. ప్రజలు సొంత బిడ్డకన్నా ఎక్కువగా ఆదరించారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత కావచ్చు, చంద్రబాబుపై ఉన్న నమ్మకం, అభిమానం కావచ్చు. రోజువారీ సమస్యలు, ధరల బాధలపై మహిళల నుంచి ఎక్కువ స్పందన కనిపిస్తోంది. జాబ్ క్యాలెండర్ విషయంలో యువత కసిగా ఉంది.

ప్రజాభిప్రాయం

ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రజలకు సంక్షేమ పథకాలు పంచుతున్నామని చెబుతున్నా, అంతకు మించి తాము దోపిడీకి గురయ్యామన్న భావన ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. కరెంటు, బస్సు చార్జీలు, ధరలు పెంచడం, రేషన్ తగ్గించడం వంటి సమస్యలపై వారు గుర్రుగా ఉన్నారు.

ఎన్నో ఫిర్యాదులు

పాలకులు చిన్న చిన్న సమస్యలను కూడా పట్టించుకోవడం లేదన్న అసంతృప్తి ప్రజల్లో బాగా కనిపిస్తోంది. ఎమ్మెల్యే, కార్పొరేటర్, మేయర్‌పై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా తాగునీటి సమస్య గురించే ప్రజలు చెప్తున్నారు. డ్రెయినేజీల సమస్యలపై వందల ఫిర్యాదులు వస్తున్నాయి. గుంతల రోడ్లపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

ఒక్క ఏడాదే లక్ష్యం

ఒక్క ఏడాదిలో టార్గెట్ పెట్టుకుని ప్రధాన సమస్యలు పరిష్కరిస్తామని చెప్పాం. అందుకోసం అద్భుతాలు చేయాల్సిన పనిలేదు. కృష్ణానది నుంచి నీటిని ఇంటింటికీ కుళాయి ద్వారా అందించే కార్యక్రమం చేపడతాం. గల్లా జయదేవ్ ఎంపీగా ఉన్నప్పుడు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం కేంద్రం నుంచి తెచ్చిన రూ.500 కోట్లకి మ్యాచింగ్ గ్రాంట్‌గా మరో 400 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చుంటే గుంటూరు రూపు రేఖలు మరోలా ఉండేవి. రోడ్లకు తారు వాసన చూపించి వైసీపీ కాంట్రాక్టర్లు బిల్లుల కైంకర్యం చేసేశారు. వాళ్లను గుర్తించి, పట్టుకుని ఏడాదిలోపు వారి చేతే రోడ్లు వేయిస్తాం.

మంత్రి రజిని గురించి

మంత్రి రజిని గురించి సామాన్యులతో సహా అందరికీ తెలుసు. జగనన్న టాక్స్‌కు తోడు రజినమ్మ టాక్స్ పేరుతో ఆమె చేసిన దోపిడీ ప్రపంచానికి తెలుసు. గుంటూరు ప్రజలు ఆ విషయం అందరికంటే ముందే పసిగట్టారు. అవినీతి సొమ్ము ఎవరినైనా కొనొచ్చన్న అహంకారంతో రజిని వ్యవహరిస్తున్నారు. గుంటూరు పశ్చిమలో నీళ్లలా డబ్బును ధారబోసినా ఆమెను ప్రజలు అంగీకరించరు. నేను గుంటూరు అడబిడ్డనే కాబట్టి నా సేవా తత్పరత, అంకితభావం ప్రజలకు తెలుసు. ఆ నమ్మకంతోనే నేను ఎన్నికల రణక్షేత్రంలోకి ధైర్యంగా అడుగుపెట్టా.

ఎంతో ఆవేదన చెందా..

పీకలవాగు పక్కన డేరాలు, గుడిసెల్లో బతుకుతున్న వారి బాధలు చూసి కదిలిపోయా. వాళ్లకు బీ- ఫారాలు ఇచ్చారేగాని పట్టించుకోలేదు. వారి ఇళ్లు వాగులో కలిసిపోతున్నాయి. వారి అవస్థలు చూసి చెప్పలేని ఆవేదన కలిగింది. చుట్టుగుంట సమీపంలోని ఓ ప్రాంతంలో దోమల దాడిని నోటితో చెప్పలేము. మొఖం మీదే వందల కొద్దీ దోమలు ముసిరి దాడి చేస్తున్నాయి. అసలు వీళ్లెలా బతుకుతున్నారా.. అన్న ఆవేదన కలిగింది.

జీవితంలో మర్చిపోలేను

ఎన్నికల ప్రచారంలో ప్రజలు హారతులు ఇవ్వడం, బొట్టుపెట్టి స్వాగతించడం మరిచిపోలేని అనుభవాలు. వీటన్నింటిని మించి మిర్చియార్డు ప్రాంతంలో ప్రజలు స్పందన, నన్ను సొంతం చేసుకున్న తీరు జీవితంలో మర్చిపోలేను. పూలవర్షం, పూలమాలలు, జయజయ ధ్వానాలతో వారు స్వాగతం పలికిన తీరు మర్చిపోలేని అనుభూతి.

సూపర్ సిక్స్‌పై ఆసక్తి

చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్, మహాశక్తి పథకాలపై ప్రజలు ఎంతో ఆసక్తితో ఉన్నారు. తల్లికి వందనం, ఆడపడుచు నిధి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలు ఎదురుచూస్తున్నారు. నిరుద్యోగ యువతలోకి మ్యానిఫెస్టో దూసుకుపోయింది. అందుకే మా వెంటే వారు నిలిచారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంక్షేమ పథకాల పునరుద్ధరణపై ఆశగా ఉన్నారు.

ప్రజల కోసం

ప్రభుత్వం ఇచ్చే సంక్షేమంతో పాటు నియోజకవర్గ ప్రజలు సమస్యలు చెప్పుకునేలా డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం ప్రతిరోజూ నిర్వహిస్తాను. మహిళల కోసం ప్రత్యేకంగా విమెన్స్ సెల్ ఏర్పాటు చేసి, ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, సామాజికంగా ఎదిగేందుకు బాధ్యత తీసుకుంటా. నియోజకవర్గ పరిధిలో బీటెక్ ఫైనలియర్ చదివే విద్యార్థుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చి, ప్లేస్‌మెంట్‌లు ఇచ్చేందుకు ప్రయత్నిస్తా.

నెరవేరని జలకళ

- నరసరావుపేట మండలం పమిడిమర్రు ప్రాంతంలో నిర్మించిన వ్యవసాయ బోరు

జలకళ పథకాన్ని అటకెక్కించారు. ఎన్‌టీఆర్ జలసిరి.. వైఎస్ఆర్ జలకళగా పేరు మార్చేసిన ప్రభుత్వం బోర్ల నిర్మాణాన్ని విస్మరించింది. పేరు మార్చుకోవడంలో శ్రద్ధ చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకం అమలుకు పైసలివ్వలేదు. సాగునీటి సంక్షోభంలో జలకళ అన్నదాతలను ఆదుకోలేకపోయింది. ప్రభుత్వం వ్యవసాయ బోర్లు నిర్మించి ఉంటే రైతులు పంటలు సాగు చేసేవారు. సాగునీరు లేక జిల్లాలో లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారాయి. రైతుల కల మన వైఎస్ఆర్ జలకళ అనే నినాదంతో ప్రవేశపెట్టిన జలకళ పథకం అమలులో ప్రభుత్వం బొక్కబోర్లా పడింది. మూడున్నరేళ్లుగా జలకళను ప్రభుత్వం సాగదీసింది. బోర్ల నిర్మాణానికి నిధులు కేటాయించడంలో చేతులెత్తేసింది. ఇప్పటికి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,235 బోర్లు మాత్రమే నిర్మించారు. జలకళ అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల రైతులకు తీరని అన్యాయం చేసింది.

జలకళ పురోగతి క్లస్టర్‌ల వారీగా ఇలా..

క్లస్టర్	దరఖాస్తుల సంఖ్య	అమోదించినవి	నిర్మించిన బోర్లు
నరసరావుపేట	823	715	104
సత్తెనపల్లి	1,895	1,532	134
మాచర్ల	5,072	4,178	757
వినుకొండ	2,597	1,986	203
బాపట్ల	314	236	76
చీరాల	4,241	1,547	821
గుంటూరు	198	157	11
తెనాలి	283	234	149
మొత్తం	15,423	10,585	2,235

- బోర్ల నిర్మాణానికి దరఖాస్తులు : 15,423
- అమోదించిన దరఖాస్తులు : 10,545
- నిర్మించిన బోర్లు : 2,235
- బోర్లు నిర్మాణం శాతం : 21.94
- విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చిన బోర్లు : 263
- మోటార్లు అమర్చిన బోర్లు : 139
- నిరూపయోగంగా ఉన్న బోర్లు : 2,096

- మూడున్నరేళ్లు.. 139 బోర్లు
- బోర్ల పథకం అమలులో బొక్కబోర్లా
- రైతులకు అక్కరకురాని జలకళ
- బోర్లు నిర్మించి ఉంటే పంటలు పండేవి
- మొక్కుబడిగా బోర్ల నిర్మాణం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు ద్రోహం
- ఇదీ జలకళలో జగనన్న సాధించిన ఘనత

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

బోర్ల నిర్మాణం కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూశారు. మొక్కుబడిగా జలకళను అమలు చేశారు. రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న పాలకులు బోర్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై వారు నోరు మెదపలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 15,423 మంది రైతులు బోర్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 10,545 దరఖాస్తులను ఆమోదించినప్పటికి 2,235 బోర్లు మాత్రమే నిర్మించారు. బోర్ల నిర్మాణం 21.94 శాతమే. నిర్మించిన బోర్లకు బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. రూ.22.56 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.72.36 లక్షలు చెల్లించారు. దీంతో బోర్లు నిర్మాణాన్ని కాంట్రాక్టర్లు నిలిపివేశారు. బోర్లకు మోటార్లు అమర్చడంలో, విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరిగింది. విద్యుత్ కనెక్షన్‌లు లేక వందలాది బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో బోర్లు అందుబాటులోకి రాకపోవడంలో వేలాదిమంది రైతులు తీవ్రంగా నష్టపోయారు.

కళ్లు కాచేలా ఎదురు చూశారు..

చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయ బోరు బావులను ఉచితంగా నిర్మించేందుకు జళకలను ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టి అమలులో చతికిలపడింది. బోరు బావుల కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది రైతులు వీటి నిర్మాణం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. పథకం అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వ్యవసాయంపై ఆధారపడిన

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారీగా బోర్ల నిర్మాణం ఇలా

వర్గం	దరఖాస్తులు	అమోదించినవి	బోర్ల నిర్మాణం
ఎస్టీ	2,745	2,256	191
ఎస్సీ	1,616	1,294	209
మైనార్టీ	271	213	34
బీసీ	5,499	4,579	1,097
మొత్తం	10,131	8,342	1,531




రైతులకు బోరు బావులతో సాగునీటి భరోసా కల్పించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. చిన్న, సన్న కారు రైతులను ఉచిత బోరు బావుల పథకం ఆదుకోలేకపోయింది. వ్యవసాయ యోగ్యమైన భూమి ప్రతి ఎకరానికి సాగులోనికి తెస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఆచరణను విస్మరించింది. బోర్ల నిర్మాణం కోసం ఏళ్ల తరబడి ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతలకు అడియాసే మిగిలింది. ప్రధానంగా నిధుల కొరత వెంటాడుతోంది. నిర్మించిన బోర్లకు పూర్తి స్థాయిలో బిల్లుల చెల్లింపులు జరగకపోతుండటంతో బోర్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. నిర్మాణం పూర్తయిన బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో కూడా జాప్యం జరుగుతూనే ఉంది. దీంతో వందలాది బోర్లు నిరుపయోగంగా మారాయి. నెలల తరబడి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అవి పూడిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు నిర్మించి ఉంటే వేలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసి ఉండేవారు.

ఇక నిర్మించిన బోర్ల విషయానికి వస్తే..!

జలకళ కింద నిర్మించిన బోర్లకు విద్యుత్ కనెక్షన్లు, మోటార్లు ఇవ్వడంలోనూ అలసత్వం తాడవిస్తోందని చెప్పవచ్చు. 2,235 బోర్లు జిల్లాలో నిర్మించారు. మూడు జిల్లాల్లో 263 బోర్లకు మాత్రమే విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు. వీటిలో కేవలం 139 బోర్లకు మోటార్లు అమర్చారు. 2,096 బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి. నిధుల విడుదల తీవ్ర జాప్యం వలనే కనెక్షన్‌లు ఆలస్యం అవుతున్నదని అధికారులు చెప్పకనే చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో 197 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వగా వీటిలో 60 బోర్లకు మాత్రమే మోటార్లు బిగించారు. బాపట్ల జిల్లాలో 50 బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వగా ఒక్క బోరుకు కూడా మోటారు బిగించకపోవడం గమనార్హం. గుంటూరు జిల్లాలో 116 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వగా 79 బోర్లకు మాత్రమే మోటార్లు అమర్చారు. 2,235 బోర్లు నిర్మిస్తే కేవలం 139 బోర్లు మాత్రమే వినియోగంలోకి వచ్చాయంటే ఈ పథకం పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైందని చెప్పవచ్చు. బోర్లు నిర్మించి నెలలు గడుస్తుండటంతో వినియోగించకపోతే అవి పూడిపోతాయన్న ఆందోళన రైతుల నుంచి వ్యక్తమవుతోంది. జలకళ కింద బోర్లు నిర్మాణ పూర్తి చేసి ఉంటే ఖరీఫ్, రబీ సీజన్‌లలో వేలాది ఎకరాల్లో రైతులు పంటలు పండించి ఆర్థికంగా లబ్ధిపోందేవారు.

ఆ రైతులకు తీరని అన్యాయం

సీఎం జగన్ నా అని చెప్పుకొనే అన్నదాలకు ఒరగబెట్టింది ఏమీ లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన రైతులు బోర్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి కూడా బోర్ల నిర్మాణం చేపట్టలేదు. అదే బోర్లు నిర్మించి ఉంటే కరువు పరిస్థితుల్లో సదరు రైతులు పంటలు పండించి ఆర్థిక లబ్ధి పొందేవారు. జగన్ వైఖరి కారణంగా ఆయా వర్గాలు సాగు చేసిన పంటలకు నీరు లేక తీవ్రంగా నష్టపోయారు. ఆయా వర్గాలకు చెందిన 10,191 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. బోర్లు మంజూరులోనూ అన్యాయమే జరిగిందనేది లెక్కలు చెబుతున్నాయి. 8,342 దరఖాస్తులను మాత్రమే ఆమోదించారు. వీరికి సంబంధించిన బోర్ల నిర్మాణం తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆమోదించిన ధరఖాస్తులలో కేవలం 1,531 బోర్లు మాత్రమే నిర్మించారు. బోర్ల నిర్మాణం 18.35 శాతానికే మూడేళ్లుగా పరిమితం అయ్యాయంటే నా.. నా అని చెప్పుకోనే వాళ్ల విషయంలోనూ జగన్ కు చిత్తశుద్ధి లేదనేది వాస్తవం అని జలకళ స్పష్టం చేస్తోంది.



వెల్దుర్తి మండలంలో బోరు నిర్మాణం

ప్రభుత్వ వైఫల్యంతోనే

తాగునీటి సంక్షోభం

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి నారా లోకేశ్ లేఖ

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 25: ప్రభుత్వ వైఫల్యం కారణంగా మంగళగిరిలో తాగునీటి సంక్షోభం తీవ్రరూపం దాల్చిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ విమర్శించారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి గురువారం లోకేశ్ లేఖ రాశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తుతుందని తెలిసినా ముందస్తు చర్యలు చేపట్టలేదన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడిపై ప్రభుత్వం ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించలేదన్నారు. నియోజకవర్గంలో టీడీపీ తరపున 2022 ఏప్రిల్ 20 నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్‌తో నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. కలెక్టరు మానవతా దృక్పథంతో నీటి సరఫరాకు అనుమతి ఇవ్వాలని లేఖలో లోకేశ్ కోరారు.



సభలో ప్రసంగిస్తున్న షర్మిల, మస్తాన్‌వలి, జంగాల

నేరం వైపా.. నిజం వైపా

మీరే తేల్చుకొని ఓటు వేయాలి • కాంగ్రెస్‌తోనే సంక్షేమం, ప్రత్యేక హోదా • గుంటూరు న్యాయయాత్రలో షర్మిల

గుంటూరు, ఏప్రిల్ 25: ఎన్నికల్లో మీరు నేరం వైపు ఉంటారా.. నిజం వైపు ఉంటారా.. తేల్చుకోని ఓటు వెయ్యండి.' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారం, న్యాయయాత్రలో భాగంగా గురువారం రాత్రి గుంటూరు సంజీవయ్యనగర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. మన జీవితాలు, జాతకాలు మార్చకలిగేది ఓటని, రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆలోచన చేసి వేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమంతో పాటు పదేళ్ళు ప్రత్యేక హోదా వస్తుందని తెలిపారు. మూడు రాజధానులని సీఎం జగన్ ప్రజల్ని మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వైసీపీకి ఓటు వేస్తే చివరకు గుండు సు న్నానే మిగిలిందని ఎద్దేవా చేశారు. సీపీఐ రాష్ట్ర నేత ము ప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ గ్యాస్, పెట్రో ధరలతో పేదల నడ్డి విరిచారని ధ్వజమెత్తారు. కార్పొరేట్ పెత్తందారులకు ప్రభుత్వ ఆస్తులను దోచిపెడుతూ దేశాన్ని నష్టాల ఊబిలోకి నెడుతున్నారని విమర్శించారు. సీపీఎం నేత పాశం రామారావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ హిందూ సామ్రాజ్యం స్థాపించే కుట్ర చేస్తుందన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. తూర్పు కాంగ్రెస్ అభ్యర్థి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ వైసీపీ నాయకులకు డబ్బులివ్వకపోతే ఇళ్ళ ముందు గోడ కూడా కట్టుకోలేని దుస్థితి నెలకొన్నదని ధ్వజమెత్తారు.

షర్మిలకు ఘన స్వాగతం

అంతముందు షర్మిలకు చుట్టుగుంట సెంటర్‌లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. చుట్టుగుంట సెంటర్ నుంచి కలెక్టరేట్ మీదగా నాజ్ సెంటర్, మూడు వంతెనలు, వసంతరాయపురం నుంచి సంజీవయ్యనగర్ వరకు ర్యాలీగా షర్మిల పర్యటన సాగింది. సమావేశంలో ఇండియా కూటమి గుంటూరు ఎంపీ అభ్యర్థి జంగాల జంగాల అజయ్‌కుమార్, పశ్చిమ కాంగ్రెస్ అభ్యర్థి రాచకొండ జాన్‌బాబు, పొన్నూరు, తాడికొండ, ప్రత్తిపాడు అభ్యర్థులు రవీంద్రనాథ్, సుశీల్‌రాజా, వినయ్ కుమార్, మంగళగిరి సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ, ఉడా మాజీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కట్టా జవహర్‌బాబు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌బాబు ఉన్నారు.



ఆటోనగర్ కార్మికులతో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని, పక్కన నజీర్, నంబూరు సుభాని, దేగల ప్రభాకర్

టీడీపీతోనే ఆటోనగర్ అభివృద్ధి

● గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తేల్చిచెప్పారు. గుంటూరు ఆటోనగర్‌లో గురువారం జరిగిన మోటార్ ఫీల్డ్ అసోసియేషన్ ఆత్మీయసమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆటోనగర్ అభివృద్ధిని విస్మరించారని, ఎంతో మంది జీవనోపాధి పొందుతున్న మోటారు వర్కర్లపై ఎమ్మెల్యే ముస్తఫా చిన్నచూపు చూశారని ఆరోపించారు. మౌలిక సదుపాయాలు లేక ఆటోనగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, వైసీపీ ప్రభుత్వంలో హామీలు ఇచ్చారు తప్ప ఇటువైపు తిరిగి చూడలేదని విమర్శించారు. ముస్లింలను కూడా వైసీపీ పట్టించుకోలేదని, గతంలో ముస్లిం మైనారిటీలను టీడీపీ ప్రభుత్వం అనేక రాజకీయ పదవులు ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని స్పష్టం చేశారు. కూటమి తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నసీర్ మాట్లాడుతూ ఆటోనగర్ వ్యాపారులకు, మెకానిక్‌లకు అండగా ఉంటామన్నారు. దుకాణాలు లేని వారికి కొత్తగా దుకాణాలు నిర్మించి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు నంబూరు సుభాని, రావి వెంకటరమణ, టీడీపీ నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్, నాయకులు షబ్బీర్, ముజీబ్, భరత్ రెడ్డి, ఉగ్గిరాల సీతారామయ్య, గౌస్, ఆటోనగర్ నాయకులు అబ్దుల్లా, ఖలీల్, భాషా, ముకబుల్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో జంగాకు అరుదైన గౌరవం

● నరసరావుపేట పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా నియామకం



జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల, ఏప్రిల్25: ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి టీడీపీలో సముచిత స్థానం లభించింది. వైసీపీని వీడి గత నెలలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన జంగా కృష్ణమూర్తిని టీడీపీ నరసరావుపేట పార్లమెంటరీ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా నియమించింది. ఈమేరకు అధినేత చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. టీడీపీలో బీసీలకు సముచిత స్థానం లభిస్తుందనేందుకు జంగా నియామకమే నిదర్శనమని గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా జంగా కృష్ణమూర్తిని యరపతినేని శ్రీనివాసరావు అభినందించారు.

తనిఖీల్లో నగదు సీజ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 25: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో రూ.1,00,000, రూ.81,000 నగదు సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీల్లో ఏప్రిల్ 25వ తేది సాయంత్రం 6 గంటల వరకు రూ.2,43,07,165ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

సాగునీరు, ఉద్యోగాల కల్పనే లక్ష్యం



టీడీపీలో చేరిన తిమ్మాపురం వారితో జీవీ, లావు శ్రీకృష్ణదేవరాయులు

● నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయులు

● వైసీపీని వీడి పలువురు టీడీపీలోకి చేరిక..

వినుకొండటౌన్, ఏప్రిల్ 25: నియోజకవర్గం నుంచి పలు గ్రామాలకు చెందిన వారు అధికార వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. నూజండ్ల మండలం తిమ్మాపురం గ్రామం 11 కుటుంబాలు, వినుకొండ పట్టణం 2వ వార్డుకు చెందిన 5 కుటుంబాలు, బొల్లాపల్లి మండలం కనుమలచెరువు గ్రామం నుంచి 5కుటుంబాల వారికి వినుకొండలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతోపాటు ఎంపీ అభ్యర్థి శ్రీలావు కృష్ణదేవరాయులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కృష్ణదేవరాయులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అరాచకాలను తట్టుకోలేని వందలాది కుటుంబాలు నేడు పార్టీని వీడుతున్నారని, అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని తెలిపారు. జీవీ మాట్లడుతూ బొల్లా అవినీతి అక్రమాలు మితిమీరిపోయాయని, బొల్లా గెలుపుకోసం అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలు గుర్తింపు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధానంగా గ్రామాల్లో మంచినీటి సౌకర్యం తోపాటు రైతులకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ రాక్షస పాలన అంతమొందించాలన్నారు. నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే మ్యేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలు ప్రజల నుంచి విశేష ఆదారణ లభించిందన్నారు. ప్రజలంత కలిసికట్టుగా కులమతాలకు అతీతంగా తెలుగుదేశంపార్టీకి ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రాథమిక స్థాయి నుంచే
భాష్యం ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ

● జాతీయ స్థాయి ర్యాంకుల సాధనకు ఇదే మార్గం

● భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ



ర్యాంకర్లకు కేక్ తినిపిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య),ఏప్రిల్ 25: ప్రాథమిక స్థాయి నుంచే భాష్యం ఐఐటి ఫౌండేషన్‌కరిక్యులమే ఐఐటి జేఈఈ ర్యాంకుల సాధనకు కారణమని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మెయిన్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు ఐఐటి, మెడిసిన్ కోసం కోచింగ్ క్యాంపస్‌లు లేవని గుంటూరులోనే 6వ తరగతి నుంచే ఐఐటి ఫౌండేషన్‌మెడిసిన్ కోసం తరగతులు ప్రారంభించి శిక్షణ అందిస్తామని వివరించారు. ఫలితంగా ఇటు ఐఐటీల్లో, అటు మెడిసిన్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలోనే ఎం. జిష్ణుసాయి ఆలిండియా టాప్ మార్కు 300కి 300 మార్కులు సాధించి 100 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 18వ ర్యాంకును, ఎం.సాయియశ్వంత్‌రెడ్డి 100 పర్సంటైల్తో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 36వ ర్యాంకును, ఈడబ్ల్యూఎస్ విభాగంలో ఆలిండియా 4వ ర్యాంకును కైవసం చేసుకున్నారని తెలిపారు. ఇంకా ఆలిండియా స్థాయిలో డి.భరత్‌చంద్ర 20వ ర్యాంకు, కేజే. వివేక్ 33, జీ. జాన్ 49, కే. హర్షిత 50 , పి .శ్యామ్ 62, జే. మణిప్రదీప్ 69, కే. చైతన్య 77, ఎ.గణేషదత్తా 78, కే.శ్రేయ 82 ర్యాంకులు సాధించారని వివరించారు. ర్యాంకర్లను భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ హనుమంతరావులు, భాష్యం ఐఐటి జేఈఈ కోఆర్డినేటర్ ఆనంద్ తదితరులు అభినందించారు.

ఐఐటి బాంబేలో సీటు సాధనే లక్ష్యం



జేఈఈ అడ్వాన్స్ లో మెరుగైన రాంకు సాధించిన ఐఐటిబాంబేలో కంప్యూటర్‌సైన్స్ సీటు సాధించడమే లక్ష్యమని జేఈఈ మెయిన్స్‌లో 18 వర్యాంకు సాధించిన ఎం.జిష్ణుసాయి పేర్కొన్నారు. భాష్యం అధ్యాపకుల ప్రత్యేక ప్రణాళికతో కూడిన బోధన, గౌడెన్స్‌లతో పాటు తల్లిదండ్రులు జ్యోతి,కృష్ణమోహన్ ప్రోత్సాహంతో ఉందన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే మెరుగైన ఫలితాలు




జాతీయ స్థాయిలో జరిగే పరీక్షలో ఒత్తిడినిఅధిగమిస్తే మెరుగైన ర్యాంకు సాధించవచ్చునని జేఈఈ మెయిన్స్‌లో 36వ ర్యాంకు సాధించిన ఎం సాయి యశ్వంత్‌రెడ్డి తెలిపారు. తల్లిదండ్రులు అరుణారెడ్డి,రామేశ్వర్ ప్రోత్సహం మరవలేని దన్నారు. 6వ తరగతి నుంచే అధ్యాపకులు ఇచ్చిన ప్రణాళికతో నూరుశాతం పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు.

బూత్ వద్ద నన్ను బలిస్తారట..

● టీడీపీ నేత అంకారావు యాదవ్

● వైసీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు

కారంపూడి, ఏప్రిల్ 25: ఎన్నికల రోజున పోలింగ్ బూత్ వద్ద నన్ను బలిస్తామని వైసీపీ నేతలు డీలర్ సూరె వెంకయ్య, మోసయ్య బ్రదర్స్ బెదిరిస్తున్నారని, గురువారం ఉదయం తనపై దాడి చేసి వెళ్లారని టీడీపీ నేత అంకారావు అన్నారు. మండలంలోని చింతపల్లిలో జరిగిన ఈదాడి ఘటనపై కారంపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ఆయన టీడీపీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీలో ఇమడలేక ఆపార్టీకి రాజీనామా చేసి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సమక్షంలో తాను టీడీపీలో చేరినట్లు చెప్పారు. ఇది సహించలేని మోసయ్య బ్రదర్స్ ఇరువురు తనపై దాడి చేసి హత్య చేస్తామని బెదిరించారన్నారు. మాపార్టీ మారుతావా అంటూ తనపై పిడిగుద్దులు కురిపించారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బ్రహ్మారెడ్డి గెలుపు వన్‌సైడ్ అని తేలిపోయిందన్నారు. ఇది సహించలేకనే వైసీపీనేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఇంతకింత ప్రతీకారం తీర్చుకుంటామని, బ్రహ్మారెడ్డి నాయకత్వంలో ప్రతి దుర్మార్గుడికి బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జాని, సీనియర్ నేత చప్పిడి రాము, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



టెయిల్‌పాండ్ ప్రాజెక్టు మెయిన్ డ్యాం

కృష్ణానది వద్ద ఏది నిఘా ?

రెంటచింతల, ఏప్రిల్ 25: వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా వున్న కృష్ణానది తీరంలో మరింత నిఘాను పెడితే అక్రమాలను అరికట్టవచ్చు. తెలంగాణాలోని చాలా గ్రామాలు ఏపీకి సరిహద్దుగా వున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి చెక్ పోస్టులను ఇరువైపులా ఏర్పాటు చేశారు.ప్రస్తుతం కృష్ణానదిలో నీటి ప్రవాహం చాలా తక్కువగా ఉంది. మరపడవలు, తెడ్ల పడవలను వినియోగించి నీటిని దాటుతున్నారు. దీంతో నగదు, మద్యం, నాటుసారా మత్తు పదార్థాలు రహస్యంగా రవాణా చేస్తున్నారు. ఏపీలో మద్యం అన్ని బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ నుంచి రవాణా చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని మద్యం తాగి చాలా మంది మృత్యువాత పడగా మరికొందరు రోగాల బారిన పడి వైద్య చికిత్సలు పొందుతున్నారు. ఎస్పీఎఫ్ సిబ్బంది ఒక ఎస్ఐతో సహా మరో 16 మంది ఇరువైపులా డ్యాంపై పహరా కాస్తున్నారు. ఈ క్రమంలో నది ఒడ్డున నిఘాను పెంచితే అక్రమాలను అరికట్టవచ్చు.

సాగర్ కుడి కాలువకు నీటి నిలిపివేత

విజయపురిసౌత్, ఏప్రిల్ 28: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కుడి కాలువకు గురువారం అధికారులు నీటిని నిలిపివేశారు. తాగునీటి నిమిత్తం 8 టీఎంసీల నీటిని కుడి కాలువ ద్వారా 17 రోజులపాటు విడుదల చేశారు. వాటా పూర్తి కావడంతో నీటిని నిలుపుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.



వెంకటపాలెం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

వైసీపీకి ఓట్లు అడిగే అర్హత లేదు

● 1591వ రోజుకు చేరుకున్న రైతుల నిరసనలు

తుళ్లూరు, ఏప్రిల్25: అమరావతి అభివృద్ధిని విస్మరించిన వైసీపీకి ఓట్లు అగిగే అర్హత లేదని రాజధానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు ఇళ్ల వద్ద నుండి చేస్తున్న ఆందోళనలు, నిరసనలు గురువారం నాటికి 1591వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, మూడు ముక్కలాటతో సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి లేకుండా చేశాడన్నారు. పరిపాలన చేయటం చేత కాని వారు మూడు రాజధానులు పెట్టి ఉద్ధరిస్తామని చెప్పటం హాస్యాస్పదమన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి.

రెండు చోట్ల నగదు పట్టివేత

చిలకలూరిపేట,ఏప్రిల్ 25: ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బృందాలు గురువారం బొప్పూడి చెక్ పోస్టు వద్ద మొత్తం రూ.3.19 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం గ్రామానికి చెందిన మర్లపాటి శ్రీనివాసరావు వద్ద నుంచి రూ.1.50 లక్షలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మరొక సంఘటనలో ఇంకొక వ్యక్తి వద్ద నుంచి రూ.1.69 లక్షలు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు.

అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద
రూ.25,47,324 స్వాధీనం

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాం ప్రసాద్ వెల్లడి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 25: నామినేషన్ పర్వం గురువారంతో ముగిసింది. మాచర్ల అసెంబ్లీ స్థానానికి 24 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాం ప్రసాద్ తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం స్క్రూటినీ కార్యక్రమం నిర్వహిస్తామని, అర్హులైన అభ్యర్థుల తుది జాబితాను సాయంత్రానికి వెల్లడిస్తామన్నారు. అలాగే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఇప్పటి వరకు రూ.25,47,324 పట్టుకున్నట్లు చెప్పారు. రూ.13.74 లక్షల విలువైన తెలంగాణ మద్యం సీజ్ చేశామన్నారు. వికలాంగులు, 85 పైబడిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు వేసుకునేందుకు ఫారం-12డి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2 వేల మంది అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ప్రధాన రాజకీయ పార్టీలపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు నమోదైనట్లు తెలిపారు.

66,153 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 62,762 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 66,153 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 45,199 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	18000
నెంబరు. 5	8500	13500
273	12000	16000
341	8000	16000
4884	9000	12500
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	8000	16000
దేవనూరు డీలక్స్	8500	16000
తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

బాధితులకు అండగా ఉంటాం..

● నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయులు



చికిత్సపొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న శ్రీకృష్ణదేవరాయలు

నసరావుపేటటౌన్, ఏప్రిల్ 25: బాధితులకు అండగా ఉంటామని, ఘటన కారకులు, సూత్రధారులకు కఠినంగా శిక్షపడేలా చూస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గురువారం ఈపూరు మండలం ఇనుమెళ్ళలో వైసీపీ మూకల దాడిలో గాయపడి నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణదేవ రాయలు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలపై దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రశాంతంగా ఉన్న పల్నాడులో గొడవలు సృష్టించడం బాధాకరం అన్నారు. ఘటనలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు సీతారామాంజనేయులు, చలమయ్య, నాగార్జున, నాగేశ్వరరావు, కుమారిలను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కారుకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ బిందుమాదవ్‌కు ఫోనులో విన్నవించారు. మంచి వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.



విద్యార్థులతో ఎగ్జిక్యూటీవ్ ఏజీఎం దుర్గాప్రసాద్ తదితరులు

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన శ్రీచైతన్య

గుంటూరు(విద్య),ఏప్రిల్25: నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ(ఎన్‌టిఎ) ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గుంటూరుజోన్ శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు జోన్ విద్యార్థులు అన్ని కేటగిరిల్లో మెరుగైన ర్యాంకులు సాధించారని తెలిపారు. ఎస్.భార్గవ్‌రెడ్డి 36వ ర్యాంకు, కే. సుమంత్‌రెడ్డి 70, పీ.ప్రవీణ్‌కుమార్ 131, కే.లోకేశ్ 157, షేక్ రజియా 166, ఎస్.వెంటక అస్విత 340, కే.రామగోపాల్ 394, పీ.జ్యోతిక 410, కే.తేజవర్ధన్ 626, వీ.శేషప్రియ 683, పీ.మణికంఠ 793, పీ.రుషితరెడ్డి 924 ర్యాంకులు సాధించారని తెలిపారు. అంతేకాకుండా 1000 లోపు 12 మంది, 2000 లోపు 35 మంది, 5000 లోపు 72 మంది, 10 వేల లోపు 153 మంది ర్యాంకులు సాధించారని వెల్లడించారు. విద్యార్థులను కళాశాల డీన్స్ కిషోర్ కుమార్, చంద్రశేఖర్, కృష్ణ, అసోసియేట్ డీన్ హరిబాబు, ప్రిన్సిపాల్ బాల సుబ్రమణ్యం, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా
కనపర్తి శ్రీనివాసరావు



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా వున్న కనపర్తి శ్రీనివాసరావుకు పార్టీ అధినేత చంద్రబాబు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పదోన్నతి కల్పించారు. ఆమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు వైసీపీ ప్రభుత్వంపై గత నాలుగున్నరేళ్లుగా ధైర్యంగా పోరాడడమే కాకుండా, దూకుడుగా ముందుకుపోతూ, పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆయనను పార్టీ గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించింది. జిల్లా నుంచి అనుక పేర్లు పరిశీలనకు వచ్చినప్పటికీ చంద్రబాబు కనపర్తి వైపే మొగ్గు చూపారని ఆ మేరకు అచ్చెన్నాయుడికి ఆదేశాలు జారీ చేశారని తెలుస్తోంది. కాగా తనని ఆ పదవిలో నియమించిన చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు, నక్కా ఆనందబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

రోలింగ్ కారిడార్ బ్లాక్‌తో ఎనిమిది రైళ్ల రద్దు

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోలింగ్ కారిడార్ బ్లాక్ కారణంగా ఎనిమిది రైళ్లను రద్దు చేస్తున్నట్లు గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి మే 22వ తేదీ వరకు నెంబరు. 07783 విజయవాడ - గుంటూరు, నెంబరు 07788 గుంటూరు-విజయవాడ, నెంబరు. 07276 కాచీగూడ-మిర్యాలగూడ, నెంబరు. 07277 మిర్యాలగూడ - కాచీగూడ, ఈ నెల 30 నుంచి మే 23వరకు నెంబరు 07973 నడికుడి - మిర్యాలగూడ, నెంబరు. 07974 మిర్యాలగూడ - కాచీగూడ, మే 1నుంచి 31 వరకు నెంబరు. 07791 కాచీగూడ - నడికుడి, నెంబరు 07792 నడికుడి-కాచీగూడ రైళ్లను రద్దు చేస్తున్నామన్నారు. నెంబరు. 07779 గుంటూరు-మాచర్ల రైలుని ఈనెల 29 నుంచి మే22 వరకు గుంటూరు-నడికుడి మధ్యన రద్దు చేశామన్నారు. నెంబరు 07780 మాచర్ల-గుంటూరు రైలుని నడికుడి-గుంటూరు మధ్యన రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ప్రజాదీవెన యాత్రలో ముస్లిం మహిళలతో మాట్లాడుతున్న నసీర్

ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా అభివృద్ధి

● తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా తయారైందని కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ విమర్శించారు. తూర్పు నియోజకవర్గం 10వ డివిజన్‌లో జరిగిన ప్రజా దీవెన యాత్రలో భాగంగా గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని జున్ను షాహిద్ నగర్, సుద్దపల్లి డొంక రోడ్ ప్రాంతాలు అధ్వానంగా ఉన్నాయని, వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే ముస్తఫా నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ఎంతో రద్దీగా ఉండే సుద్దపల్లి డొంక రోడ్డును అభివృద్ధి చేయకుండా తాత్సారం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. హడావుడి కోసం అనేకమార్లు కొబ్బరికాయలు మాత్రం కొట్టాడని పనులు మాత్రం ప్రారంభించలేదని విమర్శించారు. అనధికార హోదాలో ప్రస్తుత వైసీపీ అభ్యర్థి నూరి ఫాతిమా కూడా కొబ్బరికాయ కొట్టిందని, పనులు మాత్రం జరగలేదని అన్నారు. బహుశా వారికి కమీషన్‌లు రావనే ఉద్దేశంతో పనులు ప్రారంభం కాలేదేమోనని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మురికివాడలు లేకుండా సురక్షిత గృహాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను, తనను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ మీరావలి, రియాజ్, కందుకూరి వెంకట్, కూరకుల ప్రభాకర్, నల్లమోతు అజయ్, కరీముల్లా, కుమార్, సత్యనారాయణ, అఖాని, శేఖర్, నాగరాజు, జనసేన నాయకులు దాసరి అశోక్, నాగమల్లిక, బీజేపీ నాయకులు కె. నాగమణి, మల్లేశ్వరి, రెహమత్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనే అందరి లక్ష్యం : డీఎంహెచ్‌వో

గుంటూరు (మెడికల్), ఏప్రిల్ 25: మలేరియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రజలు చైతన్యవంతులు కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మలేరియా అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో వైద్య ఆరోగ్య శాఖ, మలేరియా శాఖ సిబ్బంది పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వరల్డ్ మలేరియా డే పురస్కరించుకొని ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ 'ప్రపంచవ్యాప్తంగా సమానత్వం కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని ఉధృతం చేద్దాం' అని పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు, ప్రజలు కూడా తమవంతు సహకారం అందించాలని ఆమె కోరారు. ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్న దోమకాటు వ్యాధుల నివారణకు ఆరోగ్య సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు డాక్టర్ విజయలక్ష్మి వెల్లడించారు. అనంతరం ఆరోగ్య శాఖ నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు కొనసాగింది. ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది మలేరియాకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. జిల్లా మలేరియా శాఖాధికారి సుబ్బరాయన్, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

జేఈఈ మెయిన్స్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 25 : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్‌లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఏజీఎం హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు బి.చైతన్య 405వ ర్యాంకు, ఎన్.శ్యామ్‌కుమార్ 473, జె.హర్షిత 514, ఎ.అఖిల్‌రాజేంద్రన్ 583, టి.మహాలక్ష్మి 596, కె.వెంకటసాయివసన్‌కుమార్ 736, కె.రోహిత్ 867, వి.సైనీ 939 ర్యాంకులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు వెయ్యిలోపు 9 మంది, 2వేల లోపు 19 మంది, 5వేల లోపు 32 మంది, 10వేల లోపు 58 మంది ర్యాంకులు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను డీన్లు వల్లభాపు, ప్రిన్సిపల్ నీవాక్ శ్రీనివాస్, రవికాంత్, వేద, రమాదేవి, జి.శ్రీనివాస్, సురేష్ అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులు

నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికల రూపకల్పన

● పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధితో పాటు, వెనుకబడిన శివారుకాలనీలను పైలెట్ ప్రాజెక్టుల క్రింద వేగంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ- జనసేన- బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గల్లా మాధవి తెలిపారు. గుంటూరు 45వ డివిజన్‌లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 18వ డివిజన్‌లో పలు కాలనీలకు చెందిన మహిళా వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆమె సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. మాధవి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన మహిళలు మాట్లాడుతూ తమకు ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధి కూడా కావాలని తెలిపారు. తమ కాలనీలో అభివృద్ధి అనే మాటే లేకుండా వైసీపీ ప్రభుత్వం చేసిందని, డ్రైనేజీ వ్యవస్థ కూడా లేకుండా పోయిందని, దీని వలన రోగాలు ప్రబలుతున్నాయని, అక్కడ తమ ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయిందన్నారు. నగరమంతా డయేరియా ప్రబలినా కూడా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదన్న ఆవేదనతో, అభివృద్ధి, సంక్షేమాన్ని అందించే సత్తా చంద్రబాబు నాయుడుకే ఉందన్న నమ్మకంతోనే తాము పార్టీలో చేరినట్లు మహిళలు తెలిపారు. గల్లా మాధవి మాట్లాడుతూ నగరాన్ని గుంతలు మయం చేసి, దానికి టీడీపీ కారణం అంటూ 5 సంవత్సరాలు గడిపేశారన్నారు. ఇప్పుడు కూడా రోడ్లు వేయలేక, గుంతలు పూడ్చలేక తమను ప్రశ్నించిన వారిపై కొంత మంది వైసీపీ కార్పొరేటర్లు ఇష్టానుసారం నోళ్లు పారేసుకుంటున్నారని, వారికి, వారి దౌర్జన్యాలకు కాలం చెల్లిందని, ఇక వైసీపీకి మిగిలింది 15 రోజులే అని గుర్తు పెట్టుకొని నడుచుకుంటే వలస పక్షికి మంచిదని హెచ్చరించారు. రాజకీయాల్లో విమర్శలు, సద్విమర్శలు సహజమని అది పరిధి దాటితే ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం మంచిది కాదని మాధవి హితవు పలికారు. గుంటూరు 38వ డివిజన్ బృందావన్ గార్డెన్స్‌లోని యాగంటి అపార్టుమెంట్స్ వాసుల ఆహ్వానం మేరకు అల్పాహార విందుకు గల్లా మాధవి హాజరయ్యారు.



పార్టీలో చేరిన మహిళలతో గల్లా మాధవి

రజని నాయకత్వంలో నీచస్థాయికి దిగజారిన రాజకీయాలు : గల్లా

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో విడదల రజని నాయకత్వంలో రాజకీయాలు చాలా నీచ



పుష్పగుచ్ఛం అందజేసి మాధవికి అభినందనలు తెలుపుతున్న అపార్టుమెంటు మహిళలు

స్థాయికి దిగజారిపోయాయని కూటమి అభ్యర్థి గల్లా మాధవి దుయ్యబట్టారు. చిలకలూరిపేటలో విడదల రజని అసాంఘిక కార్యకలాపాలు, దౌర్జన్యాలు, సోషల్ మీడియా ద్వారా నీచ ప్రచారాలు చేసి గుంటూరు పశ్చిమలో గెలుద్దామని చూస్తున్నట్లు విడదల రజని గత 3 రోజులుగా తన సోషల్ మీడియా ద్వారా తమ మీద 'గుంటూరు మిర్చి యార్డును నగర శివారుకు తరలిస్తామని' ఒక ఫేక్ పోస్టు పెట్టించి దానిని విపరీతంగా ప్రచారం చేయించిందని ఆరోపించారు. ఈ ఫేక్ పోస్టులను చూసి ఎవరు స్పందించలేదన్న భావనతో యార్డు కార్మిక సంఘం అని ప్లకార్డులు కొట్టించి, తన పార్టీ కార్యకర్తలతో రెచ్చగొట్టేందుకు విడదల రజని పూనుకుందని విమర్శించారు. రజనీ మాయలో పడటానికి ప్రజలు సిద్ధంగా లేరని హెచ్చరించారు. మిర్చి యార్డు అభివృద్ధికి మంత్రిగా రజని తీసుకున్న చర్యలు ఏమిటి? అని ప్రశ్నించారు. మిర్చి తొడాలు తీసే మహిళల కోసం టాయిలెట్‌లు కూడా నిర్మించని ఆమె ఇప్పుడు కపట ప్రేమ ఒలకబోసింది చాలు అంటూ ఎద్దేవా చేశారు. గతంలో యార్డులో దొడ్డి కాపర్లుగా ఉన్న మహిళలపై దాడులు జరిగినప్పుడు ఆ సంఘటనలపై రజని ఎందుకు స్పందించలేదో చెప్పాలన్నారు. ఎన్నికలకు ముందు రజని చేసే నటన చిలకలూరిపేట ప్రజలకు, పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. తమ వాహనాలపై దాడులు చేయటం, తిరిగి తమ మీదే కేసులు కట్టడం రజనీ రౌడీ రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలు బాగా విజ్ఞులు. నీచ రాజకీయాలను ఇకనైనా మానుకోకపోతే తగిన రీతిలో బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

యేసుభక్త నగర్‌కు చెందిన ఎస్సీ మహిళ విడదల రజిని స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు సిద్ధం అవుతున్న తరుణంలో ఎక్కడ తన ఓటు బ్యాంకు దెబ్బతింటుందోనన్న భయంతో మంత్రి విడుదల రజని వారిని భయ భ్రాంతులకు గురి చేసి ఆమెను కిడ్నాప్ చేసి అంకిరెడ్డిపాలెంలో దాచారన్నారు. దీనికి నగరంపాలెం సీఐ లోకనాథం, పట్టాభిపురం సీఐ విజయచంద్రలు సహకరించారని ఆమె ఆరోపించారు. అది బాహ్య ప్రపంచానికి తెలిసి ఎమ్మార్పీఎస్, దళిత సంఘాలు ఆందోళనకు దిగటంతో ఆమెను, ఆమె భర్తను వైసీపీ నాయకుల డైరెక్షన్‌లో పోలీస్ స్టేషన్‌కు తరలించి వదిలిపెట్టారన్నారు. ఎల్లకాలం వైసీపీ ప్రభుత్వం ఉండదన్న విషయం పోలీసులు గుర్తుపెట్టుకొని చట్టాన్ని రక్షించాలని మాధవి హితవు పలికారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగించాలి

● ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి

గుంటూరు(విద్య),ఏప్రిల్ 25: ఈనెల26తో ముగుస్తున్న పోస్టల్ బ్యాలెట్ గడువును పొడిగించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందరూ ఓటు వేయాలన్న ఎలక్షన్ కమిషన్ స్ఫూర్తిని కొనసాగించడానికి ఎలక్షన్ డ్యూటీలో పాల్గొనే ప్రతి ఒక్కరి పోస్టల్ బ్యాలెట్ ఫారం-12లు ఆర్‌వో, ఏఆర్‌వోలకు సమర్పించారా లేదా అని అధికారులు సరిచూసుకోవాలని ప్రజాస్వామిక పరిరక్షణ వాదులు కోరుతున్నారు. ఫారం 12 సమర్పించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి ఏకనాలెడ్జిమెంట్ ఇవ్వడం లేదని, కనీసం రిజిస్టర్‌లో సంతకం కూడా తీసుకోవడం లేదని ఆందోళనలు వ్యక్తపరుస్తున్నారు. చివరికి పోలింగ్ డే రోజు ఓటింగ్‌కి హాజరైన ఉద్యోగికి ఓటు లేదంటే పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. కనుక పోస్టల్ బ్యాలెట్ కొరకు సమర్పించే ఫారం12 డేట్ పొడిగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఫారం 12 సమర్పించని ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాలు సేకరించి వారు పని చేసే మండల తహసీల్దార్‌ల ద్వారా సేకరించాలని కోరుతున్నారు. ఫారం 12 సమర్పించినప్పటికి పొరపాటున ఓటింగ్ రోజు ఫెసిలిటేషన్ సెంటర్ లో ఉద్యోగి పేరు లేకపోతే వారు ఎలక్షన్ ఆర్డర్ కాపీ, ఎపిక్ కార్డుతో సరిపోల్చుకుని ఓటింగ్‌కి అనుమతించాలని కోరుతున్నారు.

దూర విద్య పది, ఇంటర్ ఫలితాలు విడుదల

గుంటూరు(విద్య), ఏప్రిల్ 25 : దూర విద్య పది, ఇంటర్ ఫలితాలను ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ గురువారం విడుదల చేసింది. గుంటూరు జిల్లా నుంచి పది దూర విద్య పరీక్షలకు 1547 మంది హాజరుకాగా 929 మంది(60.05శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ పరీక్షలకు 2870 మంది హాజరుకాగా వారిలో 1927మంది (68.87శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇక బాపట్ల నుంచి పది పరీక్షలకు 1106 మంది హాజరుకాగా వారిలో 516 మంది(46.65శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ పరీక్షలకు 2452 మంది హాజరుకాగా వారిలో 1011 మంది (41.23శాతం) ఉత్తీర్ణులయ్యారు. పల్నాడు జిల్లా నుంచి పది పరీక్షలకు 1239 మంది హాజరుకాగా వారిలో 412 మంది(41.23శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇక ఇంటర్ పరీక్షలకు 2720 మంది హాజరుకాగా వారిలో 1549 మంది(56.95శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలే లక్ష్యం

గుంటూరు, ఏప్రిల్ 25 : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన, మన గ్యాస్ మన హక్కు తదితర అంశాలపై ఉద్యమాల్లో పాల్గొన్న ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీని ఆశీర్వదించి తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని డాక్టర్ టీ సేవకుమార్ కోరారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ తరపున గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ టీ.సేవకుమార్ బ్రాడీపేట 2/1లోని ఎస్‌హెచ్‌వో భవన్‌లో గురువారం పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను డబ్బు సంపాదన కోసం, పదవుల కోసం పోటీ చేయడం లేదని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, రాజకీయ వ్యవస్థలో ప్రక్షాళన కోసం పోటీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పరిశీలకులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 25: మంగళగిరి, పొన్నూరు, తెనాలి శాసన సభ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు నీరజ్ కుమార్, ఐఏఎస్ గురువారం కలక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా జిల్లాలో సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఎన్నికలలో పాల్గొంటున్న అభ్యర్థులకు, ఓటర్లకు ఎన్నికల పరిశీలకులు ఫోన్ నెంబర్ 91548 82127లో అందుబాటులో ఉంటారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.



కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డితో చర్చిస్తున్న నీరజ్ కుమార్

నేడు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు ఆఖరి తేదీ

● పశ్చిమ ఆర్‌వో రాజ్యలక్ష్మి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 25 : ఎన్నికల విధులలో పాల్గొంటున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకొనుటకు ఏప్రిల్ 26వ తేదీ చివరి రోజని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) కె.రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ని తొలుత ఈనెల 22వ తేదీలోపు ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చిందని, ప్రస్తుతం 26వ తేదీ వరకు గడువు పొడిగించిందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం (94) పరిధిలో ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉద్యోగేతరులు (వీడియోగ్రాఫర్స్ డ్రైవర్లు మొదలుగు వారు) వారి ఓటు ఏ నియోజకవర్గంలో ఉన్నప్పటికిని, జీఎంసీలోని ఎలక్షన్ సెల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ వద్ద ఫారం-12 కు సంబంధించిన వివరాలు అందించాలని తెలియచేశారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఈనెల 26వ తేదీలోపు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎలక్షన్ సెల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్‌లో ఫారం-12(2 కాపీలు) అందించాలని తెలిపారు. ఫారం-12తో పాటుగా ఓటర్ ఎపిక్ కార్డ్ కాపీ, డ్యూటీ ఆర్డర్ కాపీ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ సిబ్బంది కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారని తెలిపారు.

తూర్పు నియోజకవర్గంలో 29 మంది అభ్యర్థుల నామినేషన్లు

● కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 25 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా, ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గం (95)కు ఈ నెల 18 నుండి 25వ తేదీ వరకు 29 మంది అభ్యర్థులు 43 సెట్ల నామినేషన్లు దాఖలు చేయడం జరిగిందని నగర కమిషనర్, తూర్పు రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లను ఈ నెల 26న స్క్రూట్నీ చేసి నిబంధనల మేరకు ఉన్న నామినేషన్ల వివరాలు తెలియచేస్తామన్నారు. ఈ నెల 29వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ అనంతరం తుది జాబితా ప్రకటించబడుతుందన్నారు.

పశ్చిమలో 38 మంది అభ్యర్థులు నామినేషన్లు

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా, ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం (94)కు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు 38 మంది అభ్యర్థులు 55 సెట్ల నామినేషన్లు దాఖలు చేయడం జరిగిందని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లను ఈనెల 26న స్క్రూట్నీ చేసి నిబంధనల మేరకు ఉన్న నామినేషన్ల వివరాలు తెలియజేస్తామన్నారు. ఈ నెల 29వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ అనంతరం తుది జాబితా ప్రకటించబడుతుందన్నారు.

27న నగరానికి రానున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్

● లెట్స్ ఓట్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కే మాలకొండయ్య

గుంటూరు(విద్య), ఏప్రిల్ 25 : రాష్ట్రంలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారి ఓటేయనున్న ఓటర్లకు దిశానిర్దేశం చేయడానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా నగరానికి రానున్నారని లెట్స్ ఓట్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కె.మాలకొండయ్య, జిల్లా కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్‌లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కళాశాలల నుంచి 18 సంవత్సరాలు దాటిన యువతీ, యువకుల ఆధ్వర్యంలో మూడు కిలోమీటర్ల నడక కార్యక్రమం ఉంటుందని, స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి మదర్‌థెరిసా విగ్రహం, కొరిటెపాడు, ఐటీసీ హోటల్ మీదుగా ఎన్టీఆర్ స్టేడియానికి చేరుకుంటారని చెప్పారు. అనంతరం అక్కడ జరిగే కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ యువతను ఉద్దేశించి ప్రసంగిస్తారు.



మాట్లాడుతున్న ఖాజావలీ, పాల్గొన్న సంఘ నాయకులు

టీడీపీ విజయానికి ముస్లింలు కృషి చేయాలి

● ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 25 : రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి ముస్లిం, మైనార్టీలు కృషి చేయాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి పిలుపునిచ్చారు. గురువారం ఆర్టీసీ కార్యాలయంలోని సంఘ కార్యాలయంలో అయన మాట్లాడుతూ మైనార్టీల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన జగన్ మైనార్టీలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ముస్లింలకు వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలపై వాస్తవాలను తెలియజేయటానికి రాష్ట్ర వ్యాప్త ప్రచారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముస్లిం, మైనార్టీల అండతో ఎన్డీఏ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ లక్షకు పైగా ఓట్ల మెజార్టీతో గెలవడం తధ్యమన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, మైనార్టీల సంక్షేమం జరగాలన్నా టీడీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. సమావేశంలో ముస్లిం హక్కుల పోరాట సమితి నాయకులు షేక్ సిరాజ్, షేక్ షాకీర్, షేక్ యాసిన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 25 : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికలో శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వహిస్తున్న 14 అంతర్జాతీయ నృత్య దినోత్సవాలు మూడవ రోజున కొనసాగాయి. కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభకు స్నిగ్ధ అయుర్వేద వైద్యశాల చైర్మన్ డాక్టర్ కెఎస్‌ఆర్ గోపాలన్, డాక్టర్ చైతన్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాకారులు స్వర దీపమహంత, రాజీబ్ ఘోష్, ఇందిరా పరాశరంలు వరుసగా మోహినీ అట్టం, కథక్, కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకులు, కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం, యువ కళారత్న పురస్కారంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలను కార్యదర్శి వెంకటగిరి నాగలక్ష్మి, పతకమూరి శ్రీలక్ష్మి పర్యవేక్షించారు.



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

27 నుంచి కేఎల్‌పీలో వేసవి శిక్షణ శిబిరం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 25: స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్‌లో ఈనెల 27 నుంచి మే 27 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వై.రథిని చౌదరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి క్రీడా శిబిరంలో క్రికెట్, ఫుట్‌బాల్, త్రోబాల్, స్కేటింగ్, కరాటే, కర్రసాము, చెస్, వెస్ట్రన్‌డ్యాన్స్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ తదితర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు 0863-2350392లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

చెల్లని చెక్కు కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 25 : చెల్లని చెక్కు కేసులో శిక్ష విధింపబడి తప్పించుకు తిరుగుతున్న నిందితుడు, గుంటూరుకు చెందిన లక్ష్మీ రఘు రామ ట్రేడర్స్ నిర్వాహకుడు బచ్చు శ్రీనివాసరావును అరెస్టు చేసి గురువారం స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడికి 2022లో విధించిన ఏడాది జైలు శిక్ష, రూ.50 లక్షల నష్ట పరిహారాన్ని అమలు చేయాలని న్యాయాధికారి ప్రవలిక ఆదేశాలు జారీ చేశారు. పట్టణానికి చెందిన తటవర్తి వెంకటేశ్వర్లు వద్ద నిందితుడు వ్యాపార నిమిత్తం రూ.25 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపుల్లో భాగంగా 2022కు ముందు రూ.25 లక్షలకు చెక్కు ఇచ్చాడు. అది చెల్లలేదు. ఈ మేరకు శ్రీనివాస రావు మరొకసారి వెంకటేశ్వర్లు కోర్టులో కేసు దాఖలు చేసుకున్నాడు. విచారణలో నేరం రుజువు కావటంతో కోర్టు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. తీర్పు సమయంలో హాజరుకావాలని నిందితుడికి నోటీసులు ఇచ్చినా హాజరు కాకపోవటంతో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసి గురువారం కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

గుంటూరు మీదగా 20 ప్రత్యేక అన్ రిజర్వుడు రైళ్ల సర్వీసులు

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా ఈ వేసవిలో 20 అన్-రిజర్వుడ్(అన్ని జనరల్ బోగీలతో ఉండే)ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు. 07234 సికింద్రాబాద్ - సంత్రగచి ప్రత్యేక రైలు ఈనెల 28 నుంచి జూన్ 30వరకు ప్రతీ ఆదివారం రాత్రి 11.40కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.08కి నడికుడి, 3.10కి సత్తెనపల్లి, సోమవారం వేకువ జామున 4.35కి గుంటూరు, మధ్యాహ్నం 12 గంటలకు దువ్వాడ, రాత్రి 7.50కి భువనేశ్వర్, మంగళవారం వేకువజామున 5 గంటలకు సంత్రగచి చేరుకొంటుంది. నెంబరు. 07235 సంత్రగచి - సికింద్రాబాద్ రైలు ఈనెల 30 నుంచి జూలై 2వ తేదీ వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 12.20కి బయలుదేరి బుధవారం ఉదయం 9.55కి గుంటూరు, 10.40కి సత్తెనపల్లి, 11.40కి నడికుడి, మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ చేరుకొంటుంది.



బెల్లంకొండలో వైసీపీ మూకలు దగ్ధం చేసిన టీడీపీ కార్యాలయం (ఫైల్)

● ఎన్నికల రహదారా..

● పట్టించుకోని అధికారులు

రోడ్డుపై మళ్లీ రోడ్డు !

పిడుగురాళ్ల, ఏప్రిల్ 25: ఎన్నికల వేళ అధికార రాజకీయ పార్టీలలో ఓట్ల గుబులు మొదలైంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎన్నాళ్ల నుంచో అడుగుతున్న పనులకు ఇప్పుడు మోక్షం కలుగుతుంది. పిడుగురాళ్లలోని మొండిగేటుకు వెళ్లే రహదారి గతుకుల మయమైందని, సిమెంట్ రోడ్డు వేయాలంటూ ఆ వీధిలోని వారు పలుమార్లు అధికారులను అడిగినప్పటికీ నిధుల కొరతతో పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం ఇప్పుడు రహదారిపై వున్న గతుకులను పూడ్చాల్సింది పోయి ఏకంగా రోడ్డుపైనే గురువారం రోడ్డు వేశారు. రోడ్డు వేసింది అధికారులా... రాజకీయ నాయకులా.. అనేది తేలాల్సి వుంది. ఏది ఏమైనప్పటికీ ఓట్ల కోసం అధికార పార్టీ చేస్తున్న కొన్నింటికి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నారు.



మొండిగేటు వైపు వెళ్లే రహదారికి సిమెంట్ వేయకముందు ఇలా...



మొండిగేటు వైపు వెళ్లే రహదారిపై వేసిన రోడ్డుపై మళ్లీ సిమెంట్ వేసిన తరువాత ఇలా..

228 మంది నామినేషన్లు

● ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

● చివరిరోజు పెద్ద సంఖ్యలో దాఖలు

● నేడు పరిశీలన.. 29 వరకు ఉపసంహరణ గడువు

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల తొలి ఘట్టమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారంతో ముగిసింది. గుంటూరు లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి మొత్తం 228మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 18నుంచి మొదలైన నామినేషన్ల పర్వం గురువారంతో ముగిసింది. వారం రోజుల పాటు కోలాహలంగా సాగిన ఈ ప్రక్రియలో గుర్తింపుపొందిన రాజకీయపార్టీల అభ్యర్థులు మొదలు, వివిధ సంఘాలు, స్వతంత్రులుగా పెద్ద సంఖ్యలో నామినేషన్లను సమర్పించారు. చివరిరోజైన గురువారం నామినేషన్లు జోరందుకున్నాయి. గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి భారీసంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. బుధవారం వరకు 37 మంది మాత్రమే నామినేషన్లు వేయగా చివరి రోజైన గురువారం మరో 30 నామినేషన్లను అభ్యర్థులు లోక్‌సభ స్థానానికి వేశారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసేసరికి 47 మంది ప్రస్తుతానికి బరిలో ఉన్నట్లు ఆర్‌వో వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శుక్రవారం అభ్యర్థులు/వారు పంపిన ఏజంట్ల సమక్షంలో జరుగుతుందన్నారు. ఇతర అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి చూస్తే.. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ బరిలోకి దిగిన మంగళగిరిలో అత్యధికంగా 44, గుంటూరు పశ్చిమలో 39, తూర్పులో 29, తెనాలిలో 20, పొన్నూరులో 18, తాడికొండలో 16, ప్రత్తిపాడులో 15 మంది నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఘట్టం ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి అభ్యర్థుల ప్రచారాలు మరింత ఉచ్ఛస్థితికి చేరుకోనున్నాయి. ఎన్నికల ప్రచారం ముగియడానికి 16 రోజుల సమయం ఉన్న నేపథ్యంలో భారీ బహిరంగ సభలు, రోడ్ షోలు కూడా జరగనున్నాయి.

కోడ్ ఉన్నా..

యథేచ్ఛగా దాడులు

● పెట్రేగిపోతున్న వైసీపీ మూకలు

● మారని అధికారుల తీరు.. ఆగని అరాచకాలు

● స్టేషన్‌లో పోలీసుల సమక్షంలోనే దాడులకు యత్నం

● టీడీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్న వైసీపీ

● ప్రశాంత, స్వేచ్ఛాయుత ఎన్నికలపై ఓటర్లలో సన్నగిల్లుతున్న నమ్మకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. అందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కల్పిస్తున్నాం. ఏ నిమిషంలో ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందిస్తున్నాం. కేసులు నమోదు చేస్తున్నాం.. అని కలెక్టర్ శివశంకర్, ఎస్పీ బిందుమాధవ్ గత కొన్ని రోజులుగా ప్రకటిస్తున్నారు.. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా గత కొన్ని రోజులుగా వరుసగా జరుగుతున్న అరాచక సంఘటనలను చూసిన వారు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోగలమా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు ఎస్పీగా రవిశంకర్‌రెడ్డి బదిలీతో అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న పోలీసులు, ఇతర ఎన్నికల అధికారులు వెనక్కి తగ్గుతారని అందరూ భావించారు. అయితే మా ధోరణి మాదే అన్నట్లుగా ఇంకా కొందరు పోలీసు అధికారులు ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అధికార పార్టీ శ్రేణులు తగ్గేదేలే అన్న రీతిలో అరాచకాలకు పాల్పడుతూనే ఉన్నాయి. తమ మాట వినని వారిపై దాడులకు తెగబడుతున్నాయి. వీటికి హద్దే లేకుండా పోయింది. వైసీపీ మూకలు పేట్రేగిపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. ఇదే అవకాశంగా టీడీపీ సానుభూతి పరులను టార్గెట్ చేస్తున్నారు. కొందరు పోలీసు అధికారులు వ్యవహరిస్తున్న తీరు ప్రశాంత ఎన్నికలపై ఓటర్లలో నమ్మకం సన్నగిల్లుతోంది. ఎస్పీ బిందు మాధవ్ జిల్లాలో ప్రశాంత ఎన్నికల కోసం విస్తృతంగా చర్యలు తీసుకుంటున్నా అదే స్థాయిలో కింది స్థాయి అధికారులు వ్యవహరించడంలేదన్న విమర్శలున్నాయి.

ప్రజల్లో భయాందోళనలు

జిల్లాలో వరుసగా జరుగుతున్న దాడులతో సామాన్య ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. మాచర్ల, గురజాల నియోజకవర్గం నుంచి ఇతర నియోజకవర్గాలకు అరాచకాలు ప్రబలుతున్నాయి. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత పెదకూరపాడు, వినుకొండ, నరసరావుపేట నియోజకవర్గాల్లో కూడా పలు సంఘటలు చోటుచేసుకున్నాయి. ఫిర్యాదు ఇస్తే ఐదే ఐదు నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా ఆచరణలో అది కనిపించడంలేదు. దాడులు పథకం ప్రకారం జరగడంలేదని, అప్పటికప్పుడు చోటు చేసుకుంటున్నాయని అధికారులు ప్రకటించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జరిగిన అరాచకాలను పరిశీలిస్తే క్షణికావేశంలో జరిగినట్లుగా కానరావడంలేదు. పథకం ప్రకారమే టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తలపై దాడుల జరుగుతున్నట్లు అర్థమవుతుంది. ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన టీడీపీ వర్గీయులపై ఏకంగా పోలీసు స్టేషన్‌లోనే పోలీసుల సమక్షంలో వైసీపీ మూకలు దాడి చేశాయంటే వారి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. వారికి పోలీసులు అండ ఎంత ఉందో అర్థమవుతుంది. మాచర్ల, గురజాల, పెదకూరపాడు, వినుకొండ, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఈ వారం పది రోజుల్లో దాదాపు 20కి పైగా సంఘటనలు జరిగాయి. ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలు చూస్తే..

- దాచేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లిన టీడీపీ కార్యకర్త యూసఫ్‌పై పోలీసుల సమక్షంలో దాడి జరిగింది.
- ఈపూరు మండలం ఇనుమెళ్లలో టీడీపీ సానుభూతిపరుల ఇళ్లపై వైసీపీ మూకలు రాళ్లతో దాడిచేసి ముగ్గురిని తీవ్రంగా గాయపరిచాయి. టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు నామినేషన్ కార్యక్రమానికి వెళ్లి వచ్చిన అనంతరం వైసీపీ మూకలు ఈ దాడికి తెగబడ్డాయి.
- నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామంలో టీడీపీ అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఎన్నికల ప్రచారాన్ని వైసీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. ప్రచార వాహనం వద్ద కర్రలతో హల్‌చల్ చేస్తూ దాడికి యత్నించాయి. ఈ సంఘటన పోలీసుల సమక్షంలోనే జరగడం గమనార్హం.
- బెల్లంకొండ మండలంలో టీడీపీ కార్యాలయాన్ని అగంతకులు దహనం చేశారు. ఇది వైసీపీ వారి పనేనని టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ కళాజాత ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. వాహనానికున్న ఫ్లెక్సీలను చించివేసి కళాకారులపై దాడిచేసి గాయపరిచారు.



నరసరావుపేట: ఉప్పలపాడులో ఇటీవల టీడీపీ అభ్యర్థుల ప్రచారాన్ని అడ్డుకుని హల్‌చల్ చేస్తున్న వైసీపీ మూకలు



దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లోనే టీడీపీ కార్యకర్త తండా యూసుఫ్‌ను గాయపర్చిన పొందుగలకు చెందిన వైసీపీ మూకలు (ఫైల్)





పెదకూరపాడు: టీడీపీ ప్రచార వాహనం ఫ్లెక్సీలను చించిన వైసీపీ మూకలు, వారి దాడిలో గాయపడిన కళాకారులు(ఫైల్)





ఈపూరు మండలం ఇనిమెళ్లలో వైసీపీ మూకల దాడిలో గాయపడిన క్షతగాత్రులు

రాజకీయాలకు.. పాఠశాల

● నిడుబ్రోలులో తొలిసారిగా ఏర్పాటు

● మహాత్మా గాంధీ చేతుల మీదుగా ప్రారంభం

● ముఖ్యమంత్రులు, మంత్రులును అందించిన పాఠశాల

పొన్నూరుటౌన్, ఏప్రిల్25: గ్రామీణ ప్రాంత ప్రజలు అన్ని రంగాలతో పాటు రాజకీయ రంగంలో కూడా రాణించాలన్న ఉద్దేశంతో నిడుబ్రోలులో రామనీడు రాజకీయ పాఠశాలను ఏర్పాటు చేశారు. రాజకీయ దురంధరుడిగా పేరుగాంచిన ఆచార్య ఎన్జీరంగా 1932లో గుంటూరు జిల్లా పొన్నూరు సమీపంలోని నిడుబ్రోలులో రామనీడు గ్రామీణ రైతాంగ విద్యాలయాన్ని మహాత్మగాంధీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ పాఠశాలలో ఎందరికో రాజకీయ ఓనమాలు దిద్దించారు. ఈ పాఠశాలకు దేశం నలుమూలల నుంచి ఉత్తములను ఎంపిక చేసి వారిని రాజకీయ పాఠాలు నేర్పించేందుకు నియమించారు. 1932లో స్వామి సీతరామ్‌ను చూసేందుకు కావూరు వినయాశ్రమానికి వచ్చిన మహాత్మగాంధీ చేత ఈ పాఠశాలను ప్రారంభించారు. పల్లె వాసులు కూడా రాజకీయ ఆర్థిక, కార్మిక వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లో ఎదిగేలా ఈ పాఠశాలను తీర్చిదిద్దారు. అలాగే స్వతంత్ర ఉద్యమంలో పల్లెవాసులకు ప్రాతినిధ్య వహించేలా ఈ పాఠశాల తర్ఫీదు ఇచ్చేది. అయితే ఈ పాఠశాల రాజకీయ పాఠశాలగా కాలక్రమంలో రూపాంతం చెంది దేశానికి ముఖ్యమంత్రులను, మంత్రులను అందచేసింది. ఆచార్య ఎన్జీ రంగా శిష్యులుగా పేరొందిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, కొణిజేటి రోశయ్య, ఆర్‌ఎం సింగ్ దేవ్ (ఒరిస్సా), చిమన్‌భాయ్ పటేల్ (గుజరాత్), అన్నదురై (తమిళనాడు), దామోదరం సంజీవయ్య, బెజవాడ గోపాల్‌రెడ్డి, భవనం వెంకట రామిరెడ్డి తదితరులు ఈ పాఠశాలలోనే రాజకీయ ఓనమాలు దిద్ది ముఖ్యమంత్రులుగా పరిపాలించారు. అలాగే సర్దార్ గౌతుల చ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, రాజగోపాల్ నాయుడు, వీరాచారి, జీయ్యర్‌దాస్, అనగాని భగవంతరావు, యడ్లపాటి వెంకట్రావు, గోవాడ పరందామయ్య, అవుతు రామిరెడ్డి తదితరులు మంత్రులుగాను, ఎంపీలు, ఎమ్మెలుగా పనిచేశారు. ఈ పాఠశాల కాలక్రమంలో శిథిలం కావటంతో పూర్తి తొలగించారు.



రామనీడు రాజకీయ పాఠశాల (ఫైల్)

5, 6, 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్

● నియోజకవర్గాల వారీగా ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆయా నియోజకవర్గాల్లోని ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్‌ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 26వ తేదీ లోపు పీవో/ఏపీవో/ఓపీవో, ఇతర సిబ్బంది ఫారం-12డీలను సంబంధిత సహాయ రిటర్నింగ్ అధికారికి అంద జేయాలన్నారు. ఓటు ఎక్కడ ఉన్నా సరే ప్రస్తుతం పనిచేస్తున్న కార్యాలయం పరిధిలోని నియోజకవర్గంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో మాత్రమే పోస్టల్ బ్యాలెట్ అందజేస్తామన్నారు. పీవో, ఏపీవోలకు మే 5, 6 తేదీల్లో శిక్షణ తరగతులు ఉన్నాయని, అవి పూర్తికాగానే అక్కడే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. ఓపీవోలు మే 7వ తేదీన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలి. ఇతర సిబ్బంది మే 8న ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. తాడికొండ నియోజకవర్గానికి సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం బాలుర పాఠశాల, తాడికొండలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మంగళగిరికి ఆత్మకూరు గ్రామంలోని నిర్మల హైస్కూల్‌లో, పొన్నూరుకు చింతలపూడిలోని వీఎస్‌ఆర్ కాలేజ్ గ్రౌండ్ ఫ్లోర్, తెనాలికి శ్రీ రావి సాంబయ్య మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాల తెనాలి, ప్రత్తిపాడుకు నల్లపాడులోని లయోల పబ్లిక్ స్కూల్, గుంటూరు పశ్చిమకు ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాల, గుంటూరు తూర్పునకు ఏసీ కళాశాలలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.



చట్టసభల్లో..

నారీభేరి

● కేంద్ర మంత్రులుగా ఇద్దరు.. రాష్ట్ర మంత్రులుగా ఐదుగురు

● హ్యాట్రిక్ సాధించిన ఇద్దరు

● పలువురు ఎమ్మెల్యేలుగా ఎన్నిక

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జనాభా.. ఓటర్లలోనూ వారే అధికం. చట్టసభల్లో ప్రాతినిధ్యానికి వచ్చేసరికి చాలా తక్కువ సంఖ్యలో ఉంటున్నారు. మహిళలకు ప్రధానంగా ఆయా రాజకీయపక్షాలు అవకాశాలు కల్పించడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు కేంద్ర మంత్రులుగా, ఐదుగురు రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు నిర్వహించారు. ఇద్దరు తమ నియోజకవర్గాల్లో హ్యాట్రిక్ సాధించారు. అవకాశాలు కల్పిస్తే దూసుకు పోతామని రుజువు చేస్తున్నారు. అయినా కొన్ని పార్టీలు వారికి సముచిత స్థానం కల్పించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

జిల్లా నుంచి లోక్‌సభకు ఎన్నికై కేంద్ర మంత్రులుగా దగ్గుబాటి పురంధేశ్వరి, పనబాక లక్ష్మి బాధ్యతలు నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురంధేశ్వరి 2004లో బాపట్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆమె యూపీఏ ప్రభుత్వంలో సహాయ మంత్రిగా పనిచేశారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో బాపట్ల లోక్‌సభ స్థానం ఎస్సీలకు కేటాయించారు. దీనితో పురంధేశ్వరి 2009లో విశాఖపట్నానికి మారారు. నెల్లూరు జిల్లాకు చెందిన పనబాక లక్ష్మి 2009లో బాపట్ల నుంచి లోక్‌సభకు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఆమె 2009-14లో కేంద్రమంత్రిగా పనిచేశారు. విభజన తరువాత 2014లో ఆమె ఇక్కడ ఓడిపోయారు. కాగా సినీనటి ఊర్వశి శారద తెనాలి నుంచి లోక్‌సభకు 1996లో టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. 1998లో అక్కడే ఓడిపోయారు. తరువాత 1999లో నెల్లూరు జిల్లా వెంకటగిరి అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తరువాత కాంగ్రెస్‌లో చేరారు.

రాష్ట్ర మంత్రులుగా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాకు చెందిన నలుగురు మహిళలు అసెంబ్లీకి ఎన్నికై మంత్రులుగా పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం మరొకరు శాసనసభకు ఎన్నికై మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. భవనం జయప్రద, నన్నపనేని రాజకుమారి, ఈపూరి సీతారావమ్మ, డాక్టర్ శనక్కాయల అరుణలు మంత్రులుగా పని చేశారు. న్యాయవాది భవనం జయప్రద వినుకొండ నుంచి రెండుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

- మాజీ సీఎం దివంగత భవనం వెంకట్రామ్ సతీమణి జయప్రద ఆయన కంటే ముందు నుంచే రాజకీయాల్లో ఉన్నారు. 1967-78లో పదేళ్లపాటు ఎమ్మెల్యేగా కొనసాగారు. అప్పట్లోనే రాష్ట్రమంత్రిగా పనిచేశారు. కోస్తా జిల్లాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు.
- తెనాలికి చెందిన నన్నపనేని రాజకుమారి 1983లో సత్తెనపల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా, 1989లో వినుకొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. సత్తెనపల్లి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నాదెండ్ల క్యాబినెట్‌లో నెలరోజుల మంత్రిగా పనిచేశారు. వినుకొండ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అసెంబ్లీ చీఫ్‌విప్‌గా కొనసాగారు. 1994లో వినుకొండ నుంచి ఓడిపోయారు. తరువాత టీడీపీలో చేరారు. నన్నపనేని ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం, కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారు. విభజన తరువాత నవ్యాంధ్ర మహిళా కమిషన్ తొలి ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించారు.
- 2009 నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఉన్న కూచినపూడి నుంచి ఈపూరి సీతారావమ్మ వరుసగా మూడుసార్లు శాసనసభకు ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. ఆమె 1985, 1989, 1994లో అసెంబ్లీకి కూచినపూడి నుంచి గెలుపొందారు. 1999లో ఓడిపోయారు. 1995-99లో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు మంత్రివర్గంలో పనిచేశారు. ఓడిపోయిన తరువాత రాజకీయాలకు దూరంగా ఉన్నారు.
- గుంటూరు నగరానికి చెందిన వైద్యురాలు శనక్కాయల అరుణ 1999లో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. టీడీపీ అభ్యర్థిగా గుంటూరు-2 నుంచి గెలుపొందిన డాక్టర్ అరుణ చంద్రబాబు క్యాబినెట్‌లో వైద్యఆరోగ్యశాఖ మంత్రిగా సుమారు రెండేళ్లు కొనసాగారు.
- పల్నాడులో మాచర్ల నుంచి 1999లో జూలకంటి దుర్గాంబ టీడీపీ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. పల్నాడు నుంచి చట్టసభలకు ఎన్నికైన తొలి మహిళగా దుర్గాంబ రికార్డు సృష్టించారు.
- చిలకలూరిపేటలో రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన డాక్టర్ కందిమళ్ల జయమ్మ 1989లో టీడీపీ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1994లో ఆమెకు టికెట్ రాలేదు. 1995లో చిలకలూరిపేట మున్సిపల్ ఛైర్మన్‌గా జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.
- గుంటూరుకు చెందిన జైమున్నీసా బేగం 1972లో పెదకూరపాడు నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మైనార్టీలు ఎక్కువగా ఉన్నారని ఒక వర్గం జైమున్నీసా బేగాన్ని రంగంలోకి దింపి గెలిపించారు. తరువాత ఆమె రాజకీయాలకు దూరమయ్యారు.
- చేనేతలు ఎక్కువగా ఉన్న మంగళగిరిలో 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా కాండ్రు కమల అసెంబ్లీకి ఎన్నికయ్యారు. విభజన తరువాత 2014లో ఆమె పోటీ చేయలేదు. 2000లో మంగళగిరి మున్సిపల్ ఛైర్మన్‌గా ప్రత్యక్ష ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు.
- తెనాలి నుంచి దివంగత దొడ్డపనేని ఇందిర ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీకి హ్యాట్రిక్ సాధించారు. ఆమె 1967, 1972, 1978లో వరుసగా మూడుసార్లు తెనాలి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 1983, 1985లో ఓడిపోయారు. ఆమె తండ్రి దివంగత ఆలపాటి వెంకటరామయ్య తెనాలి నుంచి గెలుపొంది రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.
- తెలుగుదేశం పార్టీ 1999లో తెనాలిలో డాక్టర్ గోగినేని ఉమను బరిలోకి దింపారు. ఆ ఎన్నికల్లో డాక్టర్ ఉమ కాకలు తీరిన కాంగ్రెస్ నేత రోశయ్యను ఓడించారు. 2004లో డాక్టర్ ఉమ ఓడిపోయారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత 2009లో టీడీపీ ఆమెకు టికెట్ ఇవ్వలేదు. ఉమ తల్లి ఇందిర, తాత వెంకటరామయ్యలు కూడా తెనాలి నుంచి ఎమ్మెల్యేలుగా పనిచేశారు.
- ప్రత్తిపాడు నుంచి మేకతోటి సుచరిత 2009లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ మృతి తరువాత సుచరిత జగన్‌వైపు మొగ్గారు. అసెంబ్లీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో పదవి కోల్పోయారు. తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. 2019లో తిరిగి గెలుపొందారు. ఈ దఫా నియోజకవర్గం మారి తాడికొండ నుంచి పోటీ చేస్తున్నారు. చిలకలూరిపేట నుంచి గత ఎన్నికల్లో గెలుపొందిన విడదల రజని జగన్ మంత్రివర్గంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ విధంగా జిల్లాలో పలువురు మహిళలు చట్టసభలకు ఎన్నికయ్యారు.



మంగళగిరి అసెంబ్లీకి 76 నామినేషన్లు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టం ముగిసింది. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 44 మంది అభ్యర్థుల నుంచి 76 నామినేషన్లు దాఖలైనట్టు జాయింట్ కలెక్టరు, మంగళగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి జీ రాజకుమారి తెలిపారు. ఆఖరి రోజైన గురువారం ఏడుగురు అభ్యర్థుల నుంచి 19 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం నామినేషన్ల పరిశీలన జరుగనుంది. ఈ నెల 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని ఆమె తెలిపారు.

తాడికొండ నియోజకవర్గంలో 16..

తాడికొండ, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ గురువారంతో పూర్తయింది. తాడికొండ నియోజకవర్గంలోని 16మంది అభ్యర్థులు వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ నుంచి తెనాలి శ్రావణ్‌కుమార్, తెనాలి కాంతి సుమన్‌బాబులు నామినేషన్లు వేశారు. వైసీపీ నుంచి మేకతోటి సుచరిత, మేకతోటి హర్షిత్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున మంచాల సుశీల్ రాజు, బీఎస్పీ నుంచి శృంగారపాటి బాబూరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి తాళ్లూరి నాగరాజు, జాతీయ జనసేన తరపున తెనాలి రమేష్‌బాబు, నవరంగ్ కాంగ్రెస్ నుంచి గుర్రం రామారావు, తెలుగు రాజ్యాధికార సమితీ నుంచి మెండెం మరియదాసు, ఇండి యన్ లేబర్ నుంచి దొడ్డా ముసలయ్య, జైభీమ్‌రావు భారత్ నుంచి జడా శ్రావణ్‌కుమార్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కొప్పుల దివ్యవాణి, గొడవర్తి ప్రసన్నకుమార్, రావెల ఏసయ్య, గంజి సుజనిలు నామినేషన్లు దాఖలు చేశారు.

ప్రత్తిపాడు నుంచి 15..

ప్రత్తిపాడు, ఏప్రిల్ 25: ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి పోటీకి 15 మంది 30 సెట్లు నామినేషన్లు దాఖలు చేసినట్లు ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకర్ తెలిపారు. నామినేషన్ల పర్వం చివరి రోజున ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు సతీమణి బూర్ల జయమ్మ నామినేషన్ దాఖలు చేశారు. అంతే కాకుండా రామాంజనేయులు తరుపున మొత్తం నాలుగు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే వైసీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ భార్య కెజియా శ్రవంతి నామినేషన్ దాఖలు చేయగా, ఆయన తరఫున కూడా నాలుగు నామినేషన్లు దాఖలు చేశారు.

నేడు పట్టణంలో విద్యుత్తు సరఫరా నిలిపివేత

మంగళగిరి, ఏప్రిల్ 25 : విద్యుత్ కేంద్రం, విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. ఆత్మకూరు రోడ్డు, ఇందిరానగర్, ఇప్పటం రోడ్డు, ద్వారకానగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి పది గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అవినీతి, నేరాల్లో పురోగతి సాధించిన రాష్ట్రం



25 టీడీకే 01...తాడికొండలో నిరసనలు వ్యక్తం చేస్తున్న మహిళలు, రైతులు

తాడికొండ, ఏప్రిల్ 25: సీఎం జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన దగ్గర నుంచి అవినీతి, నేరాల్లో రాష్ట్రం పురోగతి సాధించిందని రైతులు, మహిళలు తెలిపారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, రాజధాని రైతులకు మద్దతుగా, బిల్డ్ అమరావతి పేరిట తాడికొండలో రైతులు, మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల్లో విగ్రహాలు, రథాలను ధ్వంసం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులపై అక్రమంగా కేసులు బనాయించి రైతులను, మహిళలకు కంటిమీద కునుకు లేకుండా చేశారని దుయ్యబట్టారు. దళితులపై దాడులు చేసి, వారిపై ఎస్సీఎస్టీ కేసులు పెట్టిన ఘనుడు జగన్ అన్నారు. మాస్క్ అడిగినందుకు, మద్యం రేట్లు ఎందుకు పెంచారని ప్రశ్నించినందుకు, దళితులను హత్యచేసిన ఘటనలు కోకొల్లలు ఉన్నాయన్నారు. ఇళ్ల స్థలాల పేరుతో పెద్ద కుంభకోణం చేశారన్నారు. నివాసానికి పనికి రాని భూములను అధికరేట్లకు కొని వైసీపీ నేతలు జేబులు నింపుకున్నారన్నారు. వైసీపీ పార్టీని ఇంటికి పంపటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి సజ్జలకు లేదు

● పాతర్ల రమేష్

తాడేపల్లి, ఏప్రిల్ 25: ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తరువాత కూడా బరితెగిస్తున్న వైసీపీ రౌడీ మూకలకు అరాచకాలు, వత్తాసులు తోడయ్యాయని, నామినేషన్ వేస్తున్న కూటమి అభ్యర్థులపై దాడులు చేయడం దుర్మార్గమని చంద్రబాబును విమర్శించే స్థాయి సజ్జలకు లేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. గురువారం తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఓటమి ఖాయమని సర్వేలు చెప్పడంతో దాడులకు దిగుతున్నారని వారి హింస పరాకాష్టకు చేరిందని ప్రజలు గమనిస్తున్నారని, ఇటువంటి చర్యలే జగన్ ఓటమికి నాందని వ్యాఖ్యానించారు.

బలహీన వర్గాల ఆత్మగౌరవం పెరిగేలా శిక్షలుండాలి

● కొల్లా వీరయ్య చౌదరి

కాకుమాను, ఏప్రిల్ 25: బలహీన వర్గాల ప్రజల ఆత్మగౌరవం పెరిగేలా శిక్షలుండాలని సంగం డెయిరి మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లా వీరయ్య చౌదరి అన్నారు. గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆత్మకూరు పురపాలక చైర్మన్ వెంకట రమణమ్మపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయా వర్గాల ప్రజలను అవమానించడమేనన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళిత యువకుడికి శిరోముండనం చేయించి వారి ఆత్మగౌరవాన్ని కాలరాశారని విమర్శించారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘటనలు ప్రజలు మరిచిపోలేదని కొల్లా అన్నారు.

సాగునీటి సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం

● పగుళ్ళిచ్చిన గోడలు.. లీకేజీలతో నీరు వృథా
● ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని తీరు
● కాల్వలు పూడికతీయక సకాలంలో అందని నీరు





కొమ్మమూరు ఎస్కేప్‌లాకుల వద్ద నీటి విడుదల నిలిపివేసినప్పటికీ గోడలు పగుళ్ళిచ్చి వృథా అవుతున్న సాగునీరు

దుగ్గిరాల, ఏప్రిల్ 25: దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి లక్షలాది ఎకరాలకు సాగునీటి విడుదల చేసే లాకులు, హెడ్‌స్లూయిస్‌లు సైతం ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో సాగునీరు వృథా అవుతూనే ఉంది. ఏ ఏటికాయేడు మరమ్మతులు చేయక కాల్వల పూడిక తీయక సకాలంలో నీరందక పడుతున్న ఇబ్బందులు ఎవ్వరికీ పట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేవేంద్రపాడు మొదలు, అనేక చోట్ల షట్టర్‌లు మరమ్మ తులకు నోచుకోకపోగా కనీసం దుగ్గిరాల వద్ద ఉన్న లాకుల గేట్లు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. ఇదిచాలదన్నట్లు కాల్వ అంచునున్న గోడలు మరమ్మతులు చేయకపోవడంతో ఎప్పుడు ఆలీనగర్‌లోకి నీరు ప్రవేశిస్తాయోనని ఆందోళనతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కాల్వలకు నీటి విడుదల చేసే జూన్, జులై నెలల్లో తెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్ ఎడమవైపునున్న ఇళ్లలోకి సినిమాహాలు నుంచి మాంటిస్సోరి స్కూల్ సమీ పంలోని ఇళ్ల పరిసరాల్లోకి నీరు ప్రవేశిస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొమ్మమూరు ఎస్కేప్‌లాకు గోడలు బీటలు వారిన కారణంగా కాల్వలకు నీరు విడుదల చేయకపోయినప్పటికీ, గోడలనుంచి నీరు వృథాగా వెళుతూనే ఉన్నాయి. పేరుకలపూడి షట్టర్ దెబ్బతిన్న చాలా కాలం తర్వాత పనులు చేపట్టడంతో ఊపిరి పీల్చుకున్నా రు. ఈ ఏడాది కూడా వేసవి వచ్చినప్పటికీ మరమ్మతులు ఊసులేక పోవడంతో లాకులు, షట్టర్‌ల పనులు పూర్తిచేస్తారో లేదో వేచి చూడా ల్సిందే.

వైసీపీకి ఓటు వేస్తే మనం ఉరి వేసుకున్నట్లే

● అమరావతి ప్రజలను నమ్మించి మోసం చేసిన జగన్‌రెడ్డి
● సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు ఆర్థిక ఎదుగుదల
● తాడికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్



మందడంలో ప్రచారం చేస్తున్న తెనాలి శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, ఏప్రిల్ 25: అరాచక వైసీపీకి ఓటు వేస్తే మన ఉరి మనం వేసుకున్నట్టేనని తాడికొండ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కు మార్ అన్నారు. గురువారం మందడంలో ఎన్నికల ప్రచారం శ్రావణ్ నిర్వహించారు. పెద్దసంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు పేదలు ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగపడతాయని శ్రావణ్ అన్నారు. సంపద సృష్టించే చంద్రబాబునాయుడుకే ఏ సంక్షేమ పథకం అయినా అమలు చేసే సత్తా ఉందన్నా రు. జగన్‌రెడ్డి లాగ అప్పులు తెచ్చి బటన్ నొక్కాల్సిన అవసరం లేదన్నారు. ఆ అప్పులు జనం మీద జగన్‌రెడ్డి రుద్దినట్టు చంద్రబాబు నాయుడు రుద్దరన్నారు. బీసీలకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి, ఎస్సీ, బీసీలకి రూ.4వేలు పింఛన్ టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అమలు జరుగుతుందన్నారు. ఇంట్లో చదువుకునే ప్రతి పిల్లవాడికి అమ్మకు వందనం కింద రూ.15 వేలు అమలు అవుతుందన్నారు. ఎన్ని సంక్షేమ పథకాలు పెట్టినా అమలు చేసే సత్తా చంద్రబాబుకు ఉందన్నారు. జగన్‌రెడ్డి అది లేదన్నారు. ఉంటే పది లక్షల కోట్లు అప్పు చేసే వాడు కాదన్నాడు. అసమర్థ పరిపాలనతో రాష్ట్రం వెనుకబడిపోయిందన్నారు. అమరావతి రాజధాని ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆత్మ గౌరవం అని అన్నారు. ఆ ఆత్మగౌరవాన్ని మూడు ముక్కల ఆటతో చెరిపేశారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ విజయశేఖర్, మండల అధ్యక్షుడు ఎర్రగోపు నాగరాజు, బీజేపీ తాడికొండ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, మండల ఉపాధ్యక్షుడు సరపూడి సాంబశివరావు, మందడం గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఆలూరి సుబ్రమణ్యం, మండల అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు, మహిళా అధ్యక్షులు ఎర్రమనేని నాగమల్లేశ్వరి, నాయకులు వాకిచర్ల ఆంజనేయులు, నూతక్కి నాగకిశోర్, బెజవాడ రమేష్, కొండెపాటి సతీష్ చంద్ర, ముప్పవరపు క్రిష్టారావు, పేరం రాములు, యంగళదాసు సురేష్, తాళ్ళాపాలెం గిరి, చిలకా బసవయ్య, మాజీ జడ్పీటీసీ బెజవాడ నరేంద్ర, మాజీ ఎంపీటీసీ షైనేని గిరజా, మూడు పార్టీల నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతో పాటు సమాజంపై బాధ్యత ఉండాలి

● ప్రజా ధనాన్ని వృధాచేసే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదు
● ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ



కళాశాల వేడుకల్లో మాట్లాడుతున్న పంచుమర్తి అనూరాధ

దుగ్గిరాల, ఏప్రిల్ 25: విద్యార్థులు చదువుతోపాటు సమాజంపై బాధ్యతను గుర్తెరిగి నడచుకోవాలని ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ అన్నారు. చింతలపూడిలోని ప్రియదర్శినీ ఇంజనీరింగ్ కళాశాల ఫేర్‌వెల్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా అనూరాధ పాల్గొని ప్రసంగించారు.ప్రజల డబ్బు తొమ్మిది కోట్లతో నిర్మించిన ప్రజావేదిక కూల్చివేయడం సరైన విషయమేనా, ఒక ఎంపీని బెదిరించి పరిశ్రమను రాష్ట్రం నుంచి వెళ్లిపోయేలా చేశారన్న విషయం ప్రజలు ఎప్పటికీ మరచి పోలేరన్నారు. ఎవ్వరు అధికారంలోకి వచ్చినా ఒక ప్రభుత్వం చేసిన పని మంచిదైతే తర్వాత వచ్చిన ప్రభుత్వం కనీస బాధ్యతగా ఆపనిని కొనసాగించాల్సి ఉంటుందన్నారు. అధికారంలోకి వచ్చాక పార్టీలను దృష్టిలో పెట్టుకుని వాటిని కూల్చడం, మంచి పథకాలను రద్దు చేయడం సరికాదన్నారు. ఐదేళ్లకో పర్యాయం ప్రభుత్వాలు మారడం సహజమేనని ఐతే ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు తనకు బాధ కలిగిస్తున్నాయన్నారు. కళాశాల చైర్మన్ చందు రామారావు మాట్లాడుతూ 18ఏళ్లుగా తమ కళాశాల నుంచి వందలాది మంది విద్యార్థులు చదువుకుని వివిధ స్థాయిల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. అందరు విద్యార్థులు ఉపాధి పొందాలనే లక్ష్యంతో అధ్యాపకులు బోధన చేస్తారన్నారు. సెక్రటరీ చందు విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు అన్ని రంగాల్లో గొప్పవిజయాలు సాధిస్తున్నారన్నారు. అతిథులు నీటిపారుదలశాఖ ఈఈ ఎన్‌వీకే ప్రసాద, ఏఈఈ కె.ఉషారాణి, ప్రిన్సిపాల్ రాఘవేంద్రవిష్ణు, ఏ రామారావు, పలువురు హెచ్‌వోడీలు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

ఉండవల్లిలో జొన్నాకు అపూర్వ ఆదరణ



ఇండియా కూటమి అభ్యర్థులకు హారతి పడుతున్న మహిళలు

తాడేపల్లి, ఏప్రిల్ 25: ఇండియా కూటమి మంగళగిరి అసెంబ్లీ సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకర్‌రావు, గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌లకు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ ఉండవల్లిలో గురువారం రోడ్డుషో నిర్వహించారు. ఈ సందర్భంగా జొన్నా శివశంకరరావు, గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌లకు ఉండవల్లి ప్రజలు హారతులతో పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీజేపీతో ఉన్న పొత్తు పార్టీలను, తొత్తు పార్టీలను ఓడించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన అమరజీవి నిమ్మగడ్డ స్ఫూర్తితో ఎర్ర జెండా అండతో ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని జొన్నా శివశంకరరావు అన్నారు. ఈ రోడ్డు షోలో సీపీఎం రాజధాని డివిజన్ కమిటి కార్యదర్శి ఎం రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఓలేటి శాంతి, రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఎం భాగ్యరాజు, సీపీఎం నాయకులు ఆర్‌వీ హనుమంతరావు, జి.రవిబాబు, ఎస్కే ఎర్రపీరు, డి.వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, కె.జగదీశ్వర్‌రెడ్డి, టి బక్కిరెడ్డి, కె రామకృష్ణ, కె.ప్రకాశరావు, గడ్డం కృష్ణ, కుంభ ఆంజనేయులు, పార్థసారథి, ప్రజానాట్యమండలి బాధ్యులు దేవరకొండ శ్రీనివాసరావు, పెద్దిరాజు, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నాకులు కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు, ఎం డాంగే, వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు రేమినిశెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను, పెమ్మసాని గెలిపించాలని ప్రత్యేక పూజలు



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

తాడేపల్లి, ఏప్రిల్ 25: మంగళగిరి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నారా లోకేశ్‌ను గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ గురువారం ఉండవల్లి టీడీపీ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, సామల నాగేశ్వరరావులు మాట్లాడుతూ మే 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి జనసేన, బీజేపీ బలపరిచిన మంగళగిరి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్‌ను గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లి మండల ప్రచార కార్యదర్శి కొల్లి శేషు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొప్పలపూడి జ్యోతిబసు, గుంటూరు పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్, బొర్రా కృష్ణవందన, సింగంశెట్టి మల్లి, గాదె వినయ్, ఉండవల్లి మాజీ సర్పంచ్ మన్నెం కిషోర్, సుజాత, జనసేన నేతలు బడే కోమలి, లాల్‌చంద్, రాజా రమేష్, గ్రామ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో రూ.2.50లక్షలు స్వాధీనం

తాడికొండ, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాలు తనిఖీలు చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు ఎలాంటి బిల్లులు లేని రూ.2.50 లక్షలను గుర్తించారు. లాం గ్రామం వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న సందర్భంలో షేక్ ఫిరోజ్ కారును తనిఖీలు చేయగా రూ.లక్షల నగదు గుర్తించారు. అలాగే తాడికొండ-కంతేరు గ్రామాల మధ్య వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా తాడిబోయిన ప్రసాద్ అనే వ్యక్తి నుంచి రూ.1.50లక్షలు గుర్తించారు. నగదుకు ఎలాంటి బిల్లులు లేకపోవటంతో నగదును స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

అమరావతి నిర్వీర్యం చేసిన వైసీపీకి ఓటు వేయొద్దు

● తుళ్లూరులో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలు ప్రచారం



సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వివరిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

తుళ్లూరు, ఏప్రిల్ 25: అమరావతి నిర్వీర్యంతో అందిరి భవిష్యత్తును నాశనం చేసిన వైసీపీకి ఓటు వేయొద్దని టీడీపీ నేతలు అన్నారు. గురువారం తుళ్లూరులో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేశారు. మహిళలను మహాశక్తులుగా తయారు చేయటానికి చంద్రబాబునాయుడు మ్యానిఫెస్టోలో ప్రాధాన్యతనిచ్చారని ప్రచారంలో చెప్పారు. అమరావతి జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు ప్రచారం పాల్గొని రాజధాని అమరావతిపై కక్ష కట్టిన సీఎం జగన్‌రెడ్డి మనందరి మీద కక్ష కట్టినట్లేనన్నారు. అమరావతి ప్రజలను ఎలాగైనా నాశనం చేయాలనే తలంపుతో ఉన్నాడన్నారు. నాసిరకం మద్యంతో పేదలు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. అధిక ధరలకు మద్యాన్ని అమ్ముతూ పేదల జేబులకు చిల్లు పెట్టాడన్నారు. పెంచిన కరెంట్ చార్జీలు చూస్తే వైసీపీకి ఎవరూ ఓటు వేయరన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, మాజీ ఎంపీటీసీలు జొన్నలగడ్డ కిరణ్, మేకల చిన్నాబ్బాయి, కొమ్మినేని నరేంద్ర(నాని), జమ్ముల అనిల్, బండ్ల పట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో వైసీపీ నేతల దుష్ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు

మేడికొండూరు, ఏప్రిల్ 25: ఓటమి భయంతోనే జనసేన, టీడీపీ, బీజేపీపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, సర్వేలన్నీ కూటమి విజయం సాధిస్తుందని చెప్పాయని జనసేన నేతలు తెలిపారు. జనసేన, బీజేపీ, తెలుగుదేశం ఉమ్మడి అభ్యర్థులైన గుంటూరు పార్లమెంటు సభ్యుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ అసెంబ్లీ అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌లను గెలిపించాలని కోరుతూ మండలంలోని డోకిపర్రు, భీమినేనివారిపాలెం, విశదల గ్రామాల్లో జనసేన నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడు దాసరి రంగారావు, తాడికొండ మండల కాపునాడు అధ్యక్షుడు బాదినేని వెంకటరావు, తుళ్లూరు మండల కాపునాడు అధ్యక్షులు సురేష్ బాబు, మేడికొండూరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు రాచర్ల నాగబాబు, జనసేన నాయకులు గట్టు గోపి, రంగిశెట్టి బిట్టు, అద్దంకి గోపి, లింగిశెట్టి శివప్రసాద్ తదితరులతో పాటు కాపు నాయకులు పాల్గొని ఎన్డీఏకు తమ మద్దతు ప్రకటించారు.

నేడు కుంకుమ పూజ

కాకుమాను, ఏప్రిల్ 25: కొండపాటూరులో స్వయంభు పోలేరమ్మవారికి కుంకుమ పూజ మహోత్సవం శుక్రవారం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి బి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో చేశారు. ఆలయ ముందున్న మండపంలో అమ్మవారి కుంకుమ పూజ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజను జయప్రదం చేయాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ



ర్యాలీలో పాల్గొన్న మునిసిపల్, వైద్య, ఆరోగ్య సిబ్బంది

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 25: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే దోమల నివారణ సాధ్యమవుతుందని, తద్వారా అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడవచ్చని మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ సహాయ కమిషనరు లక్ష్మీపతిరావు సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంటీఎంసీ, వైద్య, ఆరోగ్య, మలేరియా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఇంట్లో నీటి నిల్వలను ఖాళీ చేసి ఎప్పటికప్పుడు కొత్త నీటిని పట్టుకోవాలని సూచించారు. డాక్టర్ స్నేహరాజ్ మాట్లాడుతూ మలేరియా జ్వరం రాకుండా ఉండాలంటే దోమల నిర్మూలన ఒక్కటే మార్గమన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవడంతోపాటు దోమతెరలు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో మంగళగిరి మలేరియా అధికారి శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్ సాగర్, సైదులు, సీహెచ్ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్లు నరసింహారావు, వాసు, నరసింహమూర్తి, ఎయిమ్స్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే పేదలకు మేలు

● మాజీ జడ్పీటీసీ, బీసీ నాయకుడు సాంబశివరావు



రైతు కూలీలతో కలసి టీడీపీ విజయం ఖాయమని చూపుతున్న మాజీ జడ్పీటీసీ సాంబశివరావు

మేడికొండూరు, ఏప్రిల్ 25: రాష్ట్రానికి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే పేదలకు మేలు జరుగుతుందని మేడికొండూరు మాజీ జడ్పీటీసీ సభ్యులు, బీసీ నాయకుడు గుంటుపల్లి సాంబశివరావు చెప్పారు. టీడీపీ పిలుపు మేరకు సిరిపురం గ్రామంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో పేదలు ప్రయోజనం పొందుతారని చెప్పారు. ఓటమి భయంతో వైసీపీ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని, వీటిని ప్రజలెవరూ నమ్మవద్దని కోరారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థిగా తాడికొండ అసెంబ్లీకి పోటీ చేస్తున్న తెనాలి శ్రావణకుమార్, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

నిజాయితీకి మారుపేరు చంద్రశేఖర్, శ్రావణకుమార్

● ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా రామకృష్ణ

తెనాలి శ్రావణ్ కుమార్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌లు అవినీతిని సహించరని టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా రామకృష్ణ చెప్పారు. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామంలోని ఎస్టీ కాలనీలో గిరిజన ఓటర్లను కలసి నియోజకవర్గ ప్రజలు తమ ఇంటి బిడ్డగా తెనాలి శ్రావణ్‌కుమార్‌ను ఆశీర్వదించి గెలిపించాలని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని రామకృష్ణ కోరారు. శ్రావణకుమార్, చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తారని, సమస్యలపై పోరాడతారని వివరించారు. వలంటీర్లకు పదివేల జీతం ఇచ్చి పథకాలు ప్రజల ఇళ్లకు చేరేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు.



ఓటు వేద్దామని ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ శేషన్న, అసిస్టెంటు కమిషనర్ అనూష, కొత్త సుబ్రహ్మణ్యం, రామచంద్రరావు కుమార్ పంప్స్ సిబ్బంది తదితరులు

ఓటు ఆవశ్యకత తెలుసుకోండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 25: ప్రతి ఒక్కరూ ఓటు ఆవశ్యకత తెలుసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న సూచించారు. స్థానిక సుల్తానాబాదు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆవరణలో గురువారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్వీప్ (ఎస్‌వీఈఈపీ)లో భాగంగా కుమార్ పంప్స్‌లోని 500మంది సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న ఓటు వేయవలసిన ఆవశ్యకతను గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13వ తేదీన వేతనంతో కూడిన సెలవు కనుక అన్ని సంస్థలలో పనిచేసే కార్మికులు, సిబ్బంది ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్క ఓటరూ హక్కుతో పాటు, తమ బాధ్యతలను గుర్తెరిగి ఓటును సద్వినియోగం చేసుకొని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలన్నారు. ప్రజలు మే 13న జరిగే ఎన్నికలలో స్వేచ్ఛగా ఎటువంటి ప్రభోవాలకు లోనుకాకుండా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. అనంతరం కమిషనర్ శేషన్న సంస్థలోని సిబ్బందితో అందరం ఓటు వేద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీ సుబ్బారావు, కుమార్ పంప్స్ అధినేతలు కొత్త కృష్ణకుమార్, కొత్త హరికుమార్, జనరల్ మేనేజర్ వి.రాజేంద్రప్రసాద్, జి.శేషగిరిరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, వై.అనుపమ, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి అసెంబ్లీ అభ్యర్థుల ఆస్తుల వివరాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25: తెనాలి అసెంబ్లీకి పోటీచేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల ఆస్తుల, అప్పుల వివరాలు ఇలా ఉన్నాయి. నామినేషన్లతో పాటు అందించిన అఫిడవిట్‌లో వీటిని పొందుపరిచారు. ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్, భార్య, కుటుంబ సభ్యుల పేరిట రూ.34.73కోట్ల విలువైన స్థలాలు, భవనాలు ఉండగా రూ.12.46 కోట్లు రుణాలు ఉన్నాయి. రూ.6.95 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తులు ఉండగా డిపాజిట్లు, బాండ్లు, షేర్‌లలో రూ.4.85కోట్లు ఉన్నాయి. 1918 గ్రాముల బంగారు నగలు, కిలో వెండి, ఒక బీఎండబ్ల్యూ, ఒక మహేంద్ర థార్ కారు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆయనపై ఎలాంటి కేసులు లేవని, గత ఏడాది ఆదాయ పన్నుకు సమర్పించిన రిటర్న్ ప్రకారం ఆయన ఆదాయం రూ.8.94 లక్షలు, భార్య ఆదాయం రూ.88.19 లక్షలు, కుటుంబ సభ్యుల ఆదాయం రూ.12.63 లక్షలుగా ఉన్నట్లు వివరించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు రూ.18.88కోట్ల విలువైన స్థలాలు, భవనాలు ఉంటే రూ.4.44 కోట్లు రుణాలు తీసుకున్నారు. స్థిర, చరాస్తుల విలువ రూ.14.13 కోట్లు కాగా, 14.86 ఎకరాలు వ్యవసాయ భూమి ఉన్నట్లు వివరించారు. బాండ్లు, షేర్‌లలో రూ.18.32 కోట్లు ఉండగా ఆయన ఆదాయం రూ.10.30 లక్షలు, భార్య ఆదాయం రూ.9.84 లక్షలుగా పేర్కొన్నారు. 480గ్రాముల బంగారు ఆభరణాలు, బీఎండబ్ల్యూ, మహేంద్ర స్కార్పియో, టయోటా ఫార్చునర్ వాహనాలున్నాయి. సమైక్యాంధ్ర ఉద్యమంలో ఒక కేసు నమోదైందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

తెనాలిలో మారిన కాంగ్రెస్ అభ్యర్థి

● డాక్టర్ సాంబశివుడు నామినేషన్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25: తెనాలి అసెంబ్లీకి కాంగ్రెస్ అభ్యర్థిని మార్పు చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్‌గా ఉన్న డాక్టర్ చందు సాంబశివుడుకు అవకాశం కల్పించారు. ఆయన పార్టీ శ్రేణులు, సీపీఎం నాయకులతో కలిసి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రఖర్ జైన్‌కు నామినేషన్ పత్రాలు అందించారు. ఇంతకు ముందు కాంగ్రెస్ అభ్యర్థిగా వ్యాపారి షేక్ బాషీద్ నామినేషన్ వేశారు. ఆయనను రాజంపేట ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించడంతో ఇక్కడ ఈ మార్పు చేసినట్లు చెబుతున్నారు. సీపీఎం నాయకులు బాబుప్రసాద్, శివసాంబిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పొన్నూరు శశి, బుల్లియ్య, దారా రామకృష్ణ, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ ఆయనతో పాటు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యే సతీమణి నామినేషన్

● ఆఖరి రోజున ఏడు నామినేషన్లు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25: తెనాలి అసెంబ్లీ స్థానానికి చివరి రోజు 11 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మొత్తం నామినేషన్ల సంఖ్య 27కి చేరింది. గురువారం ఎమ్మెల్యే సతీమణి అన్నాబత్తుని పుష్ప స్వతంత్ర అభ్యర్థిగా రిటర్నింగ్ అధికారి ప్రఖర్ జైన్‌కు పత్రాలు అందజేశారు. స్వతంత్ర్య పార్టీ గాదె రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చందు సాంబశివుడు రెండు సెట్లు, స్వతంత్ర పార్టీ అభ్యర్థి తుమపాల నరేంద్ర, దేశం జాతీయ పార్టీ అభ్యర్థి మాధవరపు నాగలక్ష్మి, స్వతంత్ర అభ్యర్థి యంద్రపాటి అశోక్‌కుమార్, సీపీఐ లిబరేషన్ పార్టీ అభ్యర్థి షావల గోపాల, స్వతంత్ర అభ్యర్థిగా ఐతగోని శివకుమార్, నవరంగ కాంగ్రెస్ అభ్యర్థిగా మదిర మనోహర్, స్వతంత్ర అభ్యర్థిగా కోట లక్ష్మణమూర్తి నామినేషన్ వేసిన వారిలో ఉన్నారు. దీంతో మొత్తం 20 మంది అభ్యర్థులు 27 నామినేషన్లు వేశారు.

చురుగ్గా పనిచేయని ఎలక్షన్ సెల్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25: సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎలక్షన్ సెల్‌లో చురుకుదనం లోపించింది. మూడు గంటలకు నామినేషన్లు పూర్తయితే సాయంత్రం ఆరు గంటలకు కూడా వివరాలు నోటీసు బోర్డు, మీడియాకు చేరడం లేదు. కార్యాలయం నుంచి నిర్వహిస్తున్న మీడియా గ్రూపునకు ఫోటోలు తప్ప నామినేషన్ల జాబితా, అఫిడవిట్‌లు ఇవ్వలేకపోతున్నారు.

తెనాలి-రేపల్లె 132 కేవీ లైన్‌కు డబుల్ సర్క్యూట్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25: తెనాలి నుంచి రేపల్లె వెళ్లే 132కేవీ విద్యుత్ లైన్‌కు డబుల్ సర్క్యూట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏడీఈ అశోక్‌బాబు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే పనుల కారణంగా ఈ రెండు పట్టణాల మధ్య గ్రామాలకు విద్యుత్ సరఫరాలో కొద్దిపాటి అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆంక్షల పేరుతో బూటకపు సంక్షేమం

● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ● టీడీపీ హయాంలో ప్రగతిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్



కరపత్రాలు ప్రదర్శిస్తున్న నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 25: ఐదేళ్ల జగన్ పాలనలో ఆంక్షల పేరుతో పేదలను పథకాలకు దూరం చేసే బూటకపు సంక్షేమం అమలు చేసారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ధ్వజమెత్తారు. మండల పరిధిలోని చింతలపూడి డీవీసీ కల్యాణ మండపంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో నరేంద్ర కుమార్ 2014-2019 మధ్య టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వంలో పొన్నూరులో జరిగిన ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. గత కొంత కాలంగా వైసీపీ నాయకులు టీడీపీ హయాంలో అసలు అభివృద్ధే జరగలేదని తామే అభివృద్ధి చేసామని అసత్య ప్రచారాలు సాగించారన్నారు. 25 ఏళ్ల అభివృద్ధి తర్వాత చెబుతానని తమ ఐదేళ్ల పాలన గురించి వివరిస్తున్నట్లు చెప్పారు. రూ.566కోట్ల వ్యయంతో 56,591 మంది మహిళలకు పసుపు కుంకుమ, స్త్రీ నిధి, వడ్డీలేని రుణాలు వంటి సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. కానీ జగన్ పాలనలో మహిళా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. రూ.403కోట్ల వ్యయంతో 142.16 కిలో మీటర్ల రహదారులు నిర్మించినట్లు చెప్పారు. వైసీపీపాలనలో గుంతలుపడితే వాటిని పూడ్చలేని అసమర్ధ పాలన సాగించారని ఎద్దేవా చేశారు. నిడుబ్రోలులో రూ.190 కోట్ల వ్యయంతో టిడ్కో ఇళ్లు నిర్మిస్తే 15 శాతం పనులు పూర్తి చేయలేక 2368 మంది లబ్ధిదారులకు ఐదేళ్ల గృహాలు అందించలేక కాలయాపన చేశారని దుయ్యబట్టారు. అలాగే అర్బన్, రూరల్ హౌసింగ్ కింద స్వొంత స్థలాలు ఉన్న 500 మందికి గృహాలు నిర్మించుకునేందుకు నగదు అందచేసినట్లు చెప్పారు. కానీ జగన్ పాలనలో పేదల ఇళ్ల నిర్మాణానికి మోకాలొడ్డి పేదలపై కక్షపూరితంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014కు ముందు నియోజకవర్గంలో 200 చొప్పున 20వేల పెన్షన్లు మాత్రమే ఉండేవని వారికి నెలకు రూ. 51.55 లక్షలు పంచిపెట్టేవారన్నారు. చంద్రబాబు హయంలలో రూ.200 పెన్షన్‌ను రూ.2000 చేసి 30,154 మంది పెన్షన్‌దారులకు నెలకు రూ.6.09 కోట్లు పంచిపెట్టినట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అడ్డగోలు నిబంధనల పేరుతో 7000 పింఛన్లు, ఒంటరి మహిళల పెన్షన్‌ను కూడా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయనికి రూ.160 కోట్ల సాయం అందించినటట్లు చెప్పారు. వైసీపీ పాలనలో రైతులే తీవ్రంగా నష్టపోయారన్నారు. తుఫాన్ల వల్లన పంట నష్టపోయిన రైతులకు నేటికి పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. ఒక యంత్రాన్ని కూడా రైతులకు అందించలేకపోయారని ఆరోపించారు. పంట పొలాలను సస్యశ్యాలమం చేసేందుకు రూ.74 కోట్ల వ్యయంతో 7 లిఫ్ట్ ఇరిగేషన్లు నాబార్డు రుణంతో నిర్మాణం ప్రారంభిస్తే వాటిని 10శాతం పూర్తి చేయలేక వైసీపీ పాలకులు రైతులకు అన్యాయం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా 6వేల మందికి రూ.46కోట్ల సబ్సిడీ రుణాలు స్వయం ఉపాధి కోసం అందించామన్నారు. వైసీపీ హయాంలో ఒక రుణమైనా అందించార అని నిలదీశారు. రూ.110 కోట్ల వ్యయంతో 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పాతపొన్నూరు, నిడుబ్రోలు, చింతలపూడి గ్రామాలో సబ్ స్టేషన్లు నిర్మించినట్లు చెప్పారు. 2248 మందికి రూ.17.25 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించామన్నారు. చంద్రన్న బీమా ద్వారా 1329మంది కుటుంబాలకు రూ.14.63 కోట్లు బీమా పరిహారం అందించినట్లు వివరించారు. చంద్రన్న పెళ్లి కానుక కింద, దుల్హన్ పథకం కింద 249మందికి రూ.1.27 కోట్లు అందించినటట్లు చెప్పారు. 1578మంది నిరుద్యోగులకు రూ.31.56 లక్షల నిరుద్యోగ భృతి అందించినట్లు వివరించారు. శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.16.48 కోట్లు, 36 బీసీ కమ్యూనిటీ హాల్స్ రూ.3.60 కోట్లు అందించినట్లు చెప్పారు. ఇవే కాకుండా నీటి ఎద్దడి నివారణకు రూ.140కోట్లు ఖర్చు చేశామన్నారు.

సమావేశంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, బీజేపీ ఇన్‌చార్జి వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అరాచకపాలనకు అంతం పలుకుదాం

● గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్



రోడ్‌షోలో మాట్లాడుతున్న గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ప్రక్కన నాదెండ్ల మనోహర్

కొల్లిపర, ఏప్రిల్ 25: రాష్ట్రంలో జరుగుతున్న అరాచకపాలనకు మనందరం అంతం పలుకుతూ ధర్మం, నీతి, నిజాయితీవైపు నడవాలని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చక్రాయపాలెం, చెముడుబాడు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థి నాదెండ్ల మనోహర్, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రోడ్‌షోలో చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం అన్నివిధాలా దోచుకున్నట్లు తెలిపారు. వైసీపీ నాయకులు చేస్తున్న బెదిరింపులకు ఏవరూ బెదిరేవారు లేరన్నారు. సంక్షేమం పేరుతో పేదప్రజలను మోసం చేసినట్లు చెప్పారు. తెనాలి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆలోచించి మన ప్రాంత అభివృద్ధికోసం, మన బిడ్డల భవిష్యత్తు కోసం ముందడుగు వేసి టీడీపీ, జనసేన అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి చంద్రశేఖర్ మన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతో ఉన్నారని ఉమ్మడి ప్రభుత్వ వచ్చాక తాను, చంద్రశేఖర్ కలిసి మన తెనాలి నియోజకవర్గాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా చేస్తానన్నారు. చంద్రశేఖర్ సేవ చేయాలనే తలంపుతో రాజకీయాల్లోకి వచ్చారని అటువంటి వ్యక్తులను మంచి మెజార్టీతో గెలిపించాలని చెబుతూ టీడీపీ, జనసేన, ఉమ్మడి అభ్యర్థిగా తనను కూడా తెనాలి నియోజకవర్గ నుంచి గెలిపించాలన్నారు. అనంతరం వైసీపీ నాయకుడు అడపాల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు, టీడీపీ తెలుగురైతు కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, కొండా కిశోర్‌రెడ్డి, ఆళ్ళ వీరారెడ్డి, దాసరి నరసయ్య, గళ్ళ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



చక్రాయపాలెంలో గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

మలేరియాపై అవగాహన కలిగి ఉండాలి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



మలేరియా అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 25: మలేరియాపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న పిలుపునిచ్చారు. పట్టణంలోని మలేరియా సబ్ యూనిట్ కార్యాలయంలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు మలేరియా వ్యాధి గురించి, దోమలు ఈ వ్యాధిని ఎలా వ్యాప్తి చేస్తాయో అన్న విషయాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. 2027 సంవత్సరం నాటికి భారతదేశంలో మలేరియా జీరో కేసులు కావాలని, 2030 నాటికి మలేరియాను నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యపడుతుందని తెలిపారు. మున్సిపల్ వైద్యాధికారి డాక్టర్ కారుమూరు హెలెన్ నిర్మల మాట్లాడుతూ విపరీతమైన జ్వరం, తలనొప్పి, విపరీతమైన చలి, వికారం మొదలైనవి మలేరియా జ్వరంలో ఉంటాయని, ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులతో మలేరియాను పూర్తిగా తగ్గించుకోవచ్చని తెలిపారు. అనంతరం పట్టణంలో మలేరియా అవగాహన ర్యాలీని నిర్వహించారు. శివాజీచౌక్‌లో మలేరియా సిబ్బంది మానవహారంగా ఏర్పడి మలేరియా గురించి అవగాహన, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ మలేరియా అధికారి చిరసాని. ప్రభాకర రెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ. ఉమాకాంత్, లెప్రసీ విభాగ డీపీఎంవో శ్యామ్, ఆప్తాల్మిక్ అసిస్టెంటు వినోద్, మలేరియా, ఫైలేరియా సిబ్బంది, మార్తా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

వ్యర్థాలను కాల్వలలో వేయరాదు

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 25 : పట్టణ ప్రజలు వ్యర్థాలను కాల్వలలో వేయరాదని పట్టణ మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న అన్నారు. పట్టణంలోని 33వ వార్డు బాలాజీరావు పేటలో గురువారం శానిటేషన్ పనులను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భర్త కోసం భార్య నిరసన



దంతలూరులో భర్త ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళ

కొల్లిపర, ఏప్రిల్ 25: భర్తకోసం ఓ భార్య పిల్లలతో కలిసి నిరసన తెలిపింది. బాధితురాలు కథనం ప్రకారం 18 సంవత్సరాల క్రితం కృష్ణాజిల్లా వుయ్యూరుకు చెందిన విజయలక్ష్మికి కొల్లిపర మండలం దంతలూరుకు చెందిన చంద్రగిరి శ్రీధర్‌తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. తన భర్త అదనపు కట్నం తేవాలంటూ హింసలకు గురిచేస్తున్నడంతో అత్త, మామలకు, ఆడపడుచులకు చెప్పుకున్న వారు పట్టించుకోలేదు. దీంతో హింస భరించలేక 7 సంవత్సరాలు క్రితం బిడ్డలను తీసుకుని పుట్టింటికి వెళ్ళి కూలి చేసుకుని పిల్లలను చదివించుకుంటున్నానని తెలిపింది. అయితే ఇటీవల అత్త సీతమ్మ, ఆడపడచు బత్తుల ఉమాదేవి, ఆడపడుచు భర్త రమేష్ కలిసి తన భర్తకు రెండో వివాహం చేశారని, ఆ విషయాన్ని కనుక్కోవటానికి అత్త గారింటికి వస్తే బయటకు గెంటి, తలుపుకు తాళాలు వేసుకుని వెళ్ళి పోయారని వాపోయింది. తన భర్త వచ్చే వరకు బిడ్డలతో సహా ఇక్కడే ఉంటానని 20రోజులుగా పిల్లలతో కలసి అత్తింటి ముందు ఆ మహిళ నిరసన కొనసాగిస్తోంది. కుటుంబ పెద్దలుగాని, పోలీసులు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని వేడుకుంది.



ప్రతిభ చూపిన విద్యార్థులతో డైరెక్టర్ బస్‌బాబు, ప్రిన్సిపాల్ ఆశాలత

పదిలో ప్రెసిడెన్సీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25: పదో తరగతి పరీక్షల్లో చేబ్రోలు ప్రెసిడెన్సీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. షేక్ చాందిని 590మార్కులు, షేక్ ఆసిన్ సుహాన 582, మనస్విని 574, జ్ఞానసిరి 570 మార్కులు సాధించారు. 24 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు పొందారని డైరెక్టర్ వాసిరెడ్డి బస్‌బాబు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ప్రిన్సిపల్ ఆశాలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 25: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దీప్తి పబ్లికేషన్స్ అధినేత అడ్డాల అంజనేయులు పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించి, చల్లని మజ్జిగను పాదచారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మువ్వా సత్యనారాయణ, జీవీ నారాయణ, చేతన్‌రాజ్ కొఠారి, కె.శ్రీనివాసరావు, ఓలేటి వెంకటప్రతాప్, చంద్రశేఖర్, విజయకుమార్, నాగేశ్వరావు, అబ్దుల్ రజాక్, పోతరాజు, బాలునాయక్, చంటి, మురళిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత భాషతో విజ్ఞానం: ఈవో మల్లేశ్వరి

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25: అన్ని భాషలకు మూలమైన సంస్కృత భాషతో విజ్ఞానం పొందవచ్చని దేవదాయశాఖ ఈవో మల్లేశ్వరి పేర్కొన్నారు. కోటా లక్ష్యయ్యనాయుడు సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గురువారం సంస్కృత భాష ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. వైఖానస సేవా సంఘం సహకారంతో గంగానమ్మపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శిక్షణ ఇచ్చారు. సంస్కృత భాష పరిచయ పుస్తకాన్ని ఆవిష్కరించారు. 30రోజుల పాటు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్రాహ్మణ సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి, ఆగమ పండితులు మామిళ్లపల్లి మృత్యుంజయప్రసాద్, రఘు, అప్పారావు, శ్రీనివాసమూర్తి, మాధవకుమార్, లక్ష్మీనరసింహాచార్యులు, శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రస్తుత పరీక్షా విధానమే అమలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25: వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి సిలబస్ మారినప్పటికి ప్రస్తుత పరీక్షా విధానమే కొనసాగుతుందని విద్యా శాఖ స్పష్టం చేసింది. పదో తరగతి పరీక్షల బ్లూ ప్రింట్‌పై వివరణ ఇచ్చింది. పబ్లిక్ పరీక్షలు ప్రస్తుతం ఉన్న సింగిల్ పేపర్ విధానంలో నాలుగు సెక్షన్లుగా జరుగుతాయి. 33 ప్రశ్నల మోడల్‌లోనే బ్లూ ప్రింట్ కొనసాగుతుందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. కాగా రాష్ట్రంలో సీబీఎస్ఈ స్కూల్స్‌లో మాత్రం పరీక్షా విధానాన్ని సీబీఎస్ఈ నిర్వహిస్తోంది.

లా సెట్, పీజీ లాసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

● కన్వీనర్ ఆచార్య సత్యనారాయణ

పెదకాకాని, ఏప్రిల్ 25: ఆంధ్రప్రదేశ్ లో న్యాయ శాస్త్ర కోర్సుల్లో ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఏపీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్, ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2024 నోటిఫికేషన్‌కు సంబంధించి దరఖాస్తు గడువును పొడిగించినట్లు లా సెట్ కన్వీనర్ ఆచార్య బి సత్యనారాయణ గురువారం తెలిపారు. విద్యార్థుల అభ్యర్థనల మేరకు మే నెల 4వ తేదీ వరకు ఏపీ లా సెట్, పీజీ లా సెట్ 2024 దరఖాస్తు అపరాధరుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. సమావేశంలో ఆచార్య జి.నాగరాజు, కె. బాల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ చందాదారులకు వైద్య పరీక్షలు

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 25: స్థానిక దేవీచౌక్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఈఎస్ఐ చందాదారులకు గురువారం ఈఎస్ఐ డిపార్టుమెంటువారి సౌజన్యంతో మెగా హెల్త్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీచైతన్య స్కూల్స్, కళాశాలలో పనిచేయు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ వంటి ప్రాథమిక పరీక్షలు 300 మందికి నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్లు మాధవి, జ్యోతి, ప్రేమ్‌చంద్, ఫణిందర్‌లు వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.తిరుపతి రావు, నన్నపనేని సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహరం ప్రచారం

తెనాలి రూరల్, ఏప్రిల్ 25: రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించుకుందామని మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం ప్రచారం చేశారు. గురువారం పట్టణంలోని 9వ వార్డులో ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఇంటింటికి పర్యటిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌ను గాజుగ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఆలయ పాలకవర్గం రాజీనామా చేయాలి

● టీడీపీ ఆర్యవైశ్యసంఘ నాయకుల డిమాండ్

తెనాలి రూరల్, ఏప్రిల్ 25: వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోకి పార్టీ జెండాలతో రాకూడదని దేవస్థాన పాలక వర్గం తీర్మానం చేసిందని దీనిని ఆచరణలో పెట్టడంలో విఫలమైన పాలకవర్గం రాజీనామా చేయాలని టీడీపీ ఆర్యవైశ్యసంఘ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బుధవారం వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నామినేషన్ వేసే క్రమంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆలయంలోకి పార్టీ జెండాలతో ప్రవేశించడాన్ని తప్పుబట్టారు. గతంలో తాము పసుపు చొక్కా ధరించి వస్తే అభ్యంతరంగా మాట్లాడటంతో చొక్కా విప్పి ఆలయంలోకి వెళ్లి పాలకవర్గాన్ని గౌరవించడం జరిగిందన్నారు. నిబంధనలు అమలు చేయడంలో విఫలమైన పాలకవర్గం భక్తులకు క్షమాపణలు చెప్పి వారి పదవులకు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేసు యుగంధర్, పెండ్యాల వెంకట్రావు, పలువురు ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మోడల్ ఎంసెట్

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 25: పట్టణంలో ఇంటర్ విద్యార్థులకు మోడల్ ఎంసెట్ ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించారు. పట్టణంలోని వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, వైష్ణవి జూనియర్ కాలేజీలలో గురువారం ఇంటర్మీడియట్ విద్యార్థులకు అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో ఎంసెట్ నమూనా పరీక్షను ఆన్‌లైనులో నిర్వహించారు. తమకు సహకరించిన కళాశాలల యాజమాన్యాలకు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, వైష్ణవి కళాశాల ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు, నన్నపనేని సునీల్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ కన్వీనర్ మద్దినేని కిరణ్‌బాబు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గుండు శివ, చెన్నూరి సాయి, కావేటి యశ్వంత్, పవన్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.